# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in








సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 202 | పేజీలు : 08 | ఆదివారం | 02-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.




2

## 'క్షమిస్తే కేసులూ ఎత్తేయండి'..

**ప్రధాని మోదీకి దిప్కే సవాల్**

- విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటన
- కేసులు కూడా ఎత్తేయాలని దిప్కే డిమాండ్
- ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధానికి నేరుగా ప్రశ్న
- విద్యార్థుల కేసులపై రాజకీయ వివాదం
- మైనర్ల విడుదలపై సుప్రీంకోర్టు ఆదేశాలు
- 15 ఏళ్ల బాలిక జీరో ఎఫ్ఐఆర్‌పై చర్చ

హైదరాబాద్ పల్స్,డెస్క్

తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే స్పందించారు. క్షమాపణ మాటలకే పరిమితం కాకుండా, ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని ఇన్‌స్టాగ్రామ్ వీడియో కింద వ్యాఖ్య చేశారు.గత వారం నుంచి వరుసగా ఇన్‌స్టాగ్రామ్ వీడియోల ద్వారా యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రధాని మోదీ, తాజాగా తనపై అసభ్య పదజాలం ఉపయోగించిన విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రకటించారు. "తిట్లతో సమస్యలు పరిష్కారం కావు. కోర్టుల చుట్టూ తిప్పడం, వేధించడం వల్ల పరిస్థితి మారదు. దారి తప్పిన




## ఉప్పల్ నల్లచెరువు జల-కళ

2

**సంతోషం వ్యక్తం సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

హైడ్రా పునరుద్ధరించిన ఉప్పల్ నల్ల చెరువు జలకళను సంతరించుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఉప్పల్ నల్లచెరువు వరద నీరుతో నిండింది. భారీ మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మురికి కూపంగా మారిన ఈ చెరువును రూ.20 కోట్లతో హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఈ క్రమంలో వర్షాలు పడినప్పుడు వరద నీరు చెరువులోకి చేరేలా, మురుగు నీరు బయటకు పోయేలా కాలువలను హైడ్రా అభివృద్ధి చేసింది. దీంతో ఎగువనున్న ప్రాంతాలు నీట మునగకుండా వరద నీరు నల్ల చెరువుకు చేరింది. 10 ఎకరాల ఆక్రమణలను తొలగించి 70 ఎకరాల విస్తీర్ణంలో నల్లచెరువును హైడ్రా సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతోంది. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ : ఉప్పల్ నల్లచెరువుకు ఎగువన ఉన్న నాచారం చెరువుతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరేలా రెండు ఇన్ లెట్లను అభివృద్ధి చేశారు. చెరువు నిండిన తర్వాత వరద నీరు సాఫీగా మూసీకి చేరేలా ఔట్ లెట్లను నిర్మించారు. నీటి నిల్వకే పరిమితం కాకుండా ప్రజలకు విశ్రాంతి, ఆరోగ్యం, వినోదం కల్పించేలా చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పటిష్టమైన మెయిన్ బండ్, పిల్లల కోసం ప్లే ఏరియా, ఓపెన్ జిమ్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. కుటుంబాలతో కలిసి ప్రశాంతంగా గడిపేలా ఆహ్లాదకరమైన ప్రదేశంగా ఉప్పల్

## వాట్సాప్ అంకుల్స్ పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు

- వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లు
- సోషల్ మీడియా వల్లే జవాబుదారీతనం పెరిగిందన్న కేటీఆర్
- నేటి యువతరం రీల్స్ రూపంలో వార్తలు చూస్తోందని వ్యాఖ్య

2



## ఈ గడ్డపై అడుగుపెట్టడం ఎంతో గర్వకారణం

భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..

2



- ఉత్తరాంధ్ర పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ రూ.18 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు ఖరారు
- గిరిజన మహిళల థింసా నృత్యం ప్రపంచ రికార్డు సాధించిందన్న ప్రధాని
- చంద్రబాబు దార్శనికతను మనస్ఫూర్తిగా అభినందించిన మోదీ

## నాపై కోపంతోనే సొరంగం ఆపారు

**కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్**



- తనపై కోపంతోనే కేసీఆర్ ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని ఆపారని మంత్రి ఆరోపణ
- సొరంగం పూర్తయితే 4 లక్షల ఎకరాలకు నీరందేదని వ్యాఖ్య
- రూ.300 కోట్లతో పనులు మళ్లీ ప్రారంభించామని వెల్లడి
- 2028 జూలై నాటికి సొరంగం పూర్తి చేసి నీళ్లిస్తామని హామీ
- క్షమాపణ చెప్పాలంటూ కేసీఆర్, కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనపై ఉన్న రాజకీయ కక్షతోనే శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనులను గతంలో కేసీఆర్ ఉద్దేశపూర్వకంగా విస్మరించారని ఆయన ఆరోపించారు. శనివారం నల్గొండ జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించిన మంత్రి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, "2007లోనే

## తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్

**దరఖాస్తుల తేదీలు ఖరారు**

2

- తెలంగాణలో 7,437 పోలీస్ పోస్టుల భర్తీకి ప్రకటన
- ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- పోలీస్, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీల భర్తీ
- నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసిన టీఎస్ఎల్‌పీఆర్‌బీ




## పీవోకేలో పాక్ దమనకాండ..

**నాలుగు రోజుల్లో 50 మందికిపైగా మృతి**

- పీవోకేలో నాలుగు రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు
- భద్రతా బలగాల చర్యల్లో 50 మందికిపైగా మృతి
- వందలాది మంది గాయపడ్డారని పౌర సంఘాల ఆరోపణ
- హెచ్‌ఆర్ఎఫ్ తీవ్ర ఖండన
- ఇంటర్నెట్, మీడియాపై ఆంక్షలు
- ఐరాసను ఆశ్రయించిన యూకేపీఎన్‌పీ ప్రతినిధులు

2



## మీ సేవ.. రికార్డు



2

- ఒక్కరోజే 2.20 లక్షల లావాదేవీలు
- దేశంలోనే నంబర్‌వన్ డిజిటల్ వేదిక
- మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వేదిక మీసేవ మరో మైలురాయిని అధిగమించింది. శుక్రవారం ఒక్కరోజే 2,20,172 లావాదేవీలు

## అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల నిరోధానికి చట్టం తెస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్లో సెలక్ట్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. సెలక్ట్ కమిటీ చైర్మన్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ భేటీ నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక

## భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం..

**సరికొత్త చరిత్రకు నాంది పలికాం: సీఎం చంద్రబాబు**



2



- ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్ర ప్రారంభమైందన్న సీఎం చంద్రబాబు
- భోగాపురం ఎయిర్‌పోర్టును ఉత్తరాంధ్రకు మణిహారంగా అభివర్ణన
- భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నట్లు వెల్లడి
- అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారన్న సీఎం
- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న మాట నిలబెట్టుకుంటున్నామని స్పష్టీకరణ

హైదరాబాద్ పల్స్,డెస్క్

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో 'అల్లూరి సీతారామరాజు

# వాట్సాప్ అంకుల్స్ పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు

మొదటి పేజీ రువాయి

వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్-జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల నీట్ పరీక్ష వైఫల్యంపై జరిగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' విజయం సాధించారని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న రాజకీయ సమీకరణాలు, యువతరం ప్రాధాన్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."యువతరం సరికొత్త రీతిలో ఢిల్లీలో కదం తొక్కింది. ఎవరితోనైతే ఘర్షణకు వెళ్లకూడదో, ప్రధాని మోదీ సరిగ్గా వారితోనే తలపడ్డారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో 'వాట్సాప్ అంకుల్స్'తో సాగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' ఎలా పైచేయి సాధించారో దేశం మొత్తం చూసింది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సైతం అర్ధరాత్రి సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా లేకపోతే పాలకుల్లో జవాబుదారీతనం ఉండేది కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నేటి యువత వార్తాపత్రికలు చదవడం గానీ, టీవీ ఛానెళ్లు చూడటం గానీ తగ్గించారని, 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు వార్తలను సైతం రీల్స్ రూపంలోనే వీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు

# నాపై కోపంతోనే సొరంగం ఆపారు

మొదటి పేజీ రువాయి

అమెరికా నుంచి యంత్రాలు తెప్పించి సొరంగం పనులు ప్రారంభిస్తే, కేవలం నాకు పేరు వస్తుందనే దురుద్దేశంతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక వాటిని నిలిపివేశారు. అప్పట్లో ఆ పనులను కొనసాగించి ఉంటే రూ.1,000 కోట్లతో రెండేళ్లలోనే పూర్తయ్యేవి. నేను ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేసీఆర్ కనికరించలేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. సొరంగం పనులు పూర్తయి ఉంటే, ప్రస్తుత కరవు పరిస్థితుల్లోనూ నల్గొండ ప్రాంతంలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, తాము అమెరికాకు వెళ్లి కాంట్రాక్టర్‌కు రూ.300 కోట్లు చెల్లించి పనులను పునరుద్ధరించామని తెలిపారు. వచ్చే రెండేళ్లలో సొరంగం పనులు పూర్తి చేసి, రెండు పంటలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. 2028 జూలై నాటికి ఈ సొరంగాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయనందుకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. వారి వైఫల్యం వల్లే ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

## అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల నిరోధానికి చట్టం తెస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్

మొదటి పేజీ రువాయి

అంశాలపై చర్చించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చించింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఓ నివేదికను సమర్పించే దిశగా ఈ కమిటీ కార్యాచరణ రూపొందించనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు పాల్గొన్నారు. మరోసారి హేట్ బిల్, స్పీచ్ బిల్లు కాపీలను సభ్యులందరికీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ ఇచ్చారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు.వారం రోజుల్లో మరోసారి తమ కమిటీ సమావేశం కానుందని తెలిపారు. వచ్చే సమావేశంలో సభ్యులందరీ నుంచి సూచనలను తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల నిరోధానికి చట్టం తీసుకువస్తామని స్పష్టం చేశారు. శాసనసభలో విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా తమ కమిటీ నివేదిక సిద్ధం చేస్తుందని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలతో పాటు సమాజంలో పేరొందిన వారి సలహాలు తీసుకుంటామని అన్నారు. వ్యక్తుల గౌరవం కాపాడే విధంగా తమ కమిటీ నివేదిక ఉంటుందని వివరించారు. భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# నల్లచెరువు జలకళ

మొదటి పేజీ రువాయి

నల్లచెరువును తీర్చిదిద్దుతున్నారు. హైడ్రా తొలి దశలో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమైన చెరువుల్లో ఉప్పల్ నల్లచెరువు ఒకటి. ఇప్పటికే మూడు చెరువులు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగా ఉప్పల్ నల్లచెరువును కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్లు హైడ్రా తెలిపింది.

హైడ్రాకు సీఎం అభినందనలు : ఉప్పల్ నల్ల చెరువుకు మళ్లీ జలకళ రావడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఎక్స్‌లో హైడ్రా పోస్టు చేసిన ఉప్పల్ నల్ల చెరువు విజువల్స్‌పై స్పందించిన సీఎం చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న హైదరాబాద్‌ను చూడటం తనకెంతో సంతృప్తిని ఇచ్చిందని వ్యాఖ్యానించారు.హైదరాబాద్ క్యూర్ పరిధిలో చెరువులకు హైడ్రా జీవం పోస్తూ భావితరాలకు జీవంతో నిండిన భవిష్యత్తును అంకితం చేస్తోందని కొనియాడారు. ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి అహర్నిశలు శ్రమించిన హైడ్రా అధికారులు, సిబ్బందికి సీఎం అభినందనలు తెలిపారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదన్న సీఎం భావితరాల భవిష్యత్తును భద్రపరచడం కూడా అని వ్యాఖ్యానించారు. ప్రతి చెరువును కాపాడుతూ ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని సంరక్షిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.

# తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్

మొదటి పేజీ రువాయి

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) బుధవారం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసింది. పోలీస్ శాఖతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు.మొత్తం ఖాళీలలో అత్యధికంగా కానిస్టేబుల్, ఆ పైస్థాయి ఉద్యోగాలే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పోస్టుల వివరాలను పరిశీలిస్తే సివిల్ ఎస్సై-148, ఏఆర్ ఎస్సై-14, టీజీఎస్పీ ఏఆర్ ఎస్సై-12, ఎస్ఏఆర్ సీపీఎల్ ఎస్సై-03, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై-23, సివిల్ కానిస్టేబుల్-3,697, ఏఆర్ కానిస్టేబుల్-1,052, ఎస్ఏఆర్ సీపీఎల్ కానిస్టేబుల్-24, కానిస్టేబుల్ (డ్రైవర్) పీటీవో-20, కానిస్టేబుల్ (మెకానిక్) పీటీవో-07 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

# పీవోకేలో పాక్ దమనకాండ..

మొదటి పేజీ రువాయి

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న నిరసనలపై పాకిస్థాన్ భద్రతా బలగాలు కఠినంగా వ్యవహరించడంతో 50 మందికిపైగా మరణించారు. వందలాది మంది గాయపడినట్లు స్థానిక సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనపై అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ' (జేఏఏసీ) సభ్యుడు సర్దార్ ఉమర్ నజీర్ కశ్మీరీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో స్పందిస్తూ, గత నాలుగు రోజుల్లో భద్రతా బలగాల చర్యల్లో 50 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ముజఫరాబాద్ ప్రాంతంలో అర్ధరాత్రి వరకు నిరసనలు కొనసాగుతున్నాయన్నారు. ప్రజలు తమ మౌలిక హక్కుల పరిరక్షణతో పాటు స్థానిక అధికారులు ఇచ్చిన హామీల అమలును కోరుతున్నారని జేఏఏసీ వెల్లడించింది.అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ (హెచ్ఆర్ఎఫ్) కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. నిరాయుధ, శాంతియుత నిరసనకారులపై పాకిస్థాన్ భద్రతా బలగాలు కాల్పులు జరిపినట్లు పేర్కొంది. స్థానిక పౌరసమాజ సంస్థల సమాచారం ప్రకారం.. ఆధారాలు దాచిపెట్టేందుకు ఆసుపత్రుల నుంచి మృతదేహాలను తొలగించడంతో పాటు ఉద్యమకారులను అదుపులోకి తీసుకున్నట్లు ఆరోపించింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, మీడియాపై ఆంక్షలు విధించడం వల్ల స్వతంత్ర సమాచారం బయటకు రావడం కష్టంగా మారిందని తెలిపింది.మరోవైపు యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ (యూకేపీఎన్‌పీ) ప్రతినిధి బృందం ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో అధికారులను కలిసి పీవోకేలో జరుగుతున్న పరిణామాలను వివరించింది. శాంతియుత నిరసనకారులపై బలప్రయోగాన్ని వెంటనే నిలిపివేయాలని, మృతదేహాలను కుటుంబాలకు అప్పగించాలని, అదృశ్యమైన వారిపై వివరాలు వెల్లడించాలని పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం ఒత్తిడి చేయాలని విజ్ఞప్తి చేసింది.

# మీ సేవ.. రికార్డు

మొదటి పేజీ రువాయి

నమోదై రికార్డు సృష్టించిందని సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ ఌ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఒకే రోజులో ఇంత భారీ స్థాయిలో లావాదేవీలు జరగడం మీసేవ చరిత్రలో తొలిసారని పేర్కొన్నారు. ఎలాంటి సాంకేతిక అంతరాయాలు లేకుండా భారీ సంఖ్యలో లావాదేవీలు పూర్తికావడం ద్వారా మీసేవ దేశంలోనే అగ్రగామి ప్రభుత్వ ఆన్‌లైన్ సేవల వేదికగా నిలిచిందన్నారు. సాధారణంగా ప్రతిరోజూ 70 నుంచి 80 వేల వరకు లావాదేవీలు నమోదవుతాయని, అయితే శుక్రవారం 2.20 లక్షలకు పైగా సేవలు అందించడం విశేషమన్నారు. ఇందులో ఫ్యామిలీ కార్డు దరఖాస్తులు, రవాణాశాఖ సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు అత్యధికంగా నమోదైన సేవలుగా నిలిచాయని వెల్లడించారు. సేవల విస్తరణ, ఆధునిక సాంకేతికత వినియోగం, మౌలిక వసతుల బలోపేతం, కొత్త పౌర సేవలను అందుబాటులోకి తీసుకురావడం వంటి చర్యల ఫలితంగానే ఈ రికార్డు సాధ్యమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల ద్వారా నిరంతరాయంగా సేవలు అందించడంలో కృషి చేసిన నిర్వాహకులు, సాంకేతిక బృందాలను మంత్రి అభినందించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చడంతో పాటు సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను మరింత మెరుగుపరుస్తూ అత్యుత్తమ సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.



## ఈ గడ్డపై అడుగుపెట్టడం

# ఎంతో గర్వకారణం

మొదటి పేజీ రువాయి

పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ ఎ ా ృ ద య ఎ ్రా ఒ ్వ క ం గా అభినందించారు.భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం..

మొదటి పేజీ రువాయి

విమానాశ్రయం' ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు.ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. "రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం" అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు.రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు

# 'క్షమిస్తే కేసులూ ఎత్తేయండి'..

మొదటి పేజీ రువాయి





యువతకు సరైన మార్గం చూపాలి" అని పేర్కొన్నారు. ఇటీవల జంతర్‌మంతర్‌లో జరిగిన విద్యార్థుల ఆందోళనల్లో తనపై, తన తల్లిపై కూడా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని చెప్పారు.దీనిపై స్పందించిన అభిజీత్ దిప్కే.. "వీడియోలో మాత్రమే క్షమిస్తారా? లేక విద్యార్థులపై నమోదైన కేసులను కూడా వెనక్కి తీసుకుంటారా?" అని ప్రశ్నించారు. అంతకుముందు పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధక చట్ట సవరణపై ప్రధాని చేసిన వీడియోను కూడా దిప్కే ఎద్దేవా చేశారు.కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత విద్యార్థులపై నమోదైన కేసుల అంశం కొత్త రాజకీయ చర్చకు దారి తీసింది. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులను వేధిస్తున్నారని సీజేపీ ఆరోపిస్తోంది. అన్ని కేసులను ఉపసంహరించకపోతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తోంది. మరోవైపు నేర చరిత్ర లేని విద్యార్థులు, మైనర్లను విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.ఇదే సమయంలో ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన 15 ఏళ్ల బాలికపై నమోదైన జీరో ఎఫ్ఐఆర్ కూడా వివాదానికి కేంద్రంగా మారింది. అనంతరం ఆ బాలిక క్షమాపణ వీడియో విడుదల చేసింది. తన చుట్టూ ఉన్న వారి ప్రభావంతో అలా మాట్లాడానని, అది తన తొలి, చివరి తప్పు అని పేర్కొంది. అయినప్పటికీ ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవడాన్ని సీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అనుచిత భాషను సమర్థించడం లేదని, అయితే అలాంటి వ్యాఖ్యలకే క్రిమినల్ కేసులు నమోదు చేయడం భావ ప్రకటన స్వేచ్ఛపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పార్టీ నేతలు అంటున్నారు.

# ఓల్డ్ ఎయిర్పోర్ట్ రోడ్లోని యోగశాలలో గురు పౌర్ణమి వేడుకలు

## యోగ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా గురు పూజోత్సవం

**ఆగస్టు 01, బోయిన్పల్లి,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** గురు పౌర్ణమి సందర్భంగా బోయిన్పల్లి నుండి బాల్కంపేట వెళ్లే బేగంపేట్ ఓల్డ్ ఎయిర్పోర్ట్ రోడ్లో ఉన్న యోగ శాలలో గురు పౌర్ణమి వేడుకలు యోగ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యోగ శాలలో గత కొన్ని ఏండ్లుగా శిక్షణ ఇచ్చే గురువులందరి గురువుల విశిష్టత, గొప్పదనాన్ని గుర్తించి వారికీ పాద పూజ చేసుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు హైదరాబాద్ పల్స్ పత్రిక ద్వారా తెలుపుతూ గురువులేని సాధన క్లిష్టమైందని, సాక్షాత్తు భగవానుడే విద్యను నేర్చుకోడానికి గురువు తొడ్పాటు ఎంతో అవసరం. భారతీయ సంప్రదాయంలో గురువును బ్రహ్మ,విష్ణు, మహేశ్వరునితో పోల్చారు. ఇక, గురు–శిష్య బంధం ఎంతో గొప్పదని,ఈ పరంపర ఎంతో అద్భుతమైందని, మానవజాతి ముందుకు సాగాలంటే మన ప్రాచీన జ్ఞాన సంపదను కూడా మనతో పాటు తీసుకెళ్లాలని ఆయన అన్నారు. గురు పౌర్ణమి అనేది గురువులతో ఉన్న అనుబంధాన్ని, కృతజ్ఞతను హృదయపూర్వకంగా అనుభవించే రోజని యోగ శిష్యులు తెలిపారు. గురువు లేకుండా సాధన కష్టంగా అనిపిస్తుందని, సాక్షాత్తూ శ్రీరాముడు, శ్రీకృష్ణుడు సైతం తన విద్యాభ్యాసం కోసం గురువులను ఆశ్రయించారని వివరించారు. గురు–శిష్య పరంపర అనే సంప్రదాయం ఎంతో అద్భుతమైనది. మానవజాతి ముందుకు సాగాలంటే మన ప్రాచీన జ్ఞాన సంపదను కూడా మనతో పాటు తీసుకెళ్లాలి. మీ సమస్యలు, బాధలు, కష్టాలను అధిగమించడానికి సహాయపడేవాడు గురువు. మనస్సుకు ప్రశాంతతను ప్రసాదించి, జీవితంలో ముందుకు సాగేందుకు సహాయపడేవాడు గురువు. జీవితంలో కృతజ్ఞతతో ఉండడానికి లక్షల అవకాశాలు ఉన్నాయి. అలాగే ఫిర్యాదులు చేయడానికి కోట్ల అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక యోగ గురువులు రవి గురూజీనీ, రాంజన్ గురూజీ, పవన్ గురూజీ, దారం వెంకటేశం గుప్తా సేవలకు గాను ప్రత్యేక గురు పూజోత్సవంతో గురు భక్తిని చాటుకున్నారు. ఇంకా ఈ గురు సేవలో ముఖ్య గురువులు ముకుంద్ రావు గురూజీ, నరేందర్ గురూజీ, రాయుడు గురూజీ, దారం సతీష్ గుప్తా గురూజీ, ఐలారెడ్డి గురూజీ, రామకృష్ణ గురూజీ, శంకర్ గురూజీ లను ఘనంగా, పూల దండలు, శాలువాలతో సన్మానించి



బహుమతులను ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో యోగ సభ్యులు జక్కోజు వినోద్ కుమార్, జీ.వినోద్ రామలీల, పూనమ్, మధు దాస్, రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, సునీతా, యోగ గురువులు, యోగ శిక్షణ పురుషులు, మహిళల సభ్యులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానించిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి

## బీజేపీ యువ మోర్చా నారాయణఖేడ్ శాఖా



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, నారాయణ ఖేడ్ :** ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ దరఖాస్తు కూడా నింపడం రాదంటూ, వారిని క్రిమినల్స్‌తో పోల్చుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారాహిత్యమైనవి, అవమానకరమైనవి. రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా చేసిన ఈ వ్యాఖ్యలను నిరసిస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాల కోసం తీవ్రంగా శ్రమిస్తున్న యువతను ప్రోత్సహించాల్సిన ముఖ్యమంత్రి, వారిని కించపరుస్తూ మాట్లాడటం దురదృష్టకరం. నిరుద్యోగ సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం, విద్యార్థులను అవమానించే వ్యాఖ్యలు చేయడం తగదు. అందువల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని రాష్ట్రంలోని ఇంజనీరింగ్ విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీజేవైఎం డిమాండ్ చేస్తోంది. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో యువ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్, రవి కుమార్, పట్నం మాణిక్, సాయి పటేల్, మండల టౌన్ అధ్యక్షులు రాజు గౌడ్, దశరథ్, సగుణకర్, జ్ఞానేశ్వర్, సయేందర్, యస్ టీ మోర్చా అధ్యక్షులు పవన్, సాగర్ విఠల్, తదితరులు పాల్గొనారు.

# పలు కాలనీ సమస్యలపై సంక్షేమ సంఘం ఎమ్మెల్యేతో భేటీ

## పికెట్ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందచేత

**ఆగస్టు 01, పికెట్, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** కంటోన్మెంట్ వార్డు 8, బొల్లారంలోని జనప్రియ బంగ్లోస్ యజమానుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ ను మర్యాదపూర్వకంగా పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలసి కాలనీలోని పలు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.కాలనీ అనుకుని ఉన్న రైల్వే లైన్ పక్కన ఓపెన్ డ్రెయిన్ వల్ల విపరీతమైన దుర్గంధం, దోమల ముప్పు పెరుగుతోందని తెలిపారు. వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరే ప్రమాదం ఉన్నందున కంటోన్మెంట్ మరియు రైల్వే అధికారులతో మాట్లాడి వెంటనే పైప్‌లైన్ పనులు పూర్తి చేయించాలని కోరారు. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నారని, నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి కాలనీకి కొత్త బోర్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీలోని పిల్లలకు వినోదం, పెద్దలకు మరియు వయోవృద్ధులకు శారీరక ఆరోగ్యం అందించేందుకు గాను చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్ మరియు ఓపెన్ జిమ్ సాధనాలను ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే శ్రీ శ్రీగణేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి



బాలరాజు, కాలనీ వైస్ ప్రెసిడెంట్ కర్నల్ (డాక్టర్) పి.కె. మలాకర్, ట్రెజరర్ వై. రమణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బి.ఆర్.ఎస్ నాయకుడు మల్లయ్య మృతి పట్ల సంతాపం.. కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 01, నర్సింహులపేట**
కౌసల్యాదేవిపల్లి గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు ఏర్పుల హరీష్ తండ్రి మల్లయ్య ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఈ దుఃఖ సమయంలో ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు ముందుకు వచ్చి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. మృతుని కుటుంబానికి పార్టీ తరుపున రూ. 12,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, పార్టీ తరఫున ఎల్లవేళలా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, గ్రామ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు ఎడ్ల విష్ణు వర్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ బానోతు రవి, మాజీ సర్పంచ్ రాయపాటి చంద్ర రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఎడ్ల సరిత శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు గొట్టిముక్కల రవీందర్ రెడ్డి, నరసింహ రెడ్డి, రవి, వార్డ్ మెంబర్లు కొత్త వెంకటయ్య, కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, బానోతు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్ ఎమోషనల్ స్పీచ్.. మోదీని తిడితే కన్నీళ్లొచ్చాయి..

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, ఏపీ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, పారిశ్రామిక రంగానికి గేమ్‌చేంజర్‌గా మారనున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఘనంగా ప్రారంభమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ మెగా ఎయిర్‌పోర్ట్‌ను జాతికి అంకితం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుతో పాటు జీఎంఆర్ గ్రూప్ అధినేతలు పాల్గొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో రూపుదిద్దుకున్న టెర్మినల్ భవనాన్ని, చెక్–ఇన్ హాళ్లను ప్రధాని మోదీ సవివరంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని, ఆయన పడుతున్న శ్రమను కొనియాడుతూ పవన్ చేసిన వ్యాఖ్యలు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**‘ఈ నేల ఎవరికీ తలవంచదు’.. అల్లూరి పేరుతో నవశకం!**

“ఆంగ్లేయుల పాలనపై తిరుగుబాటు బావుటా ఎగురవేసి.. ‘ఈ నేల ఎవరికీ బానిసగా ఉండదు, ఈ జాతి ఎవరికీ తలవంచదు’ అని సవాల్ విసిరిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు. ఆయన పేరును ఈ అంతర్జాతీయ విమానాశ్రయానికి పెట్టడం ఏపీ ప్రజలందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం. ఇది కేవలం ఆయనకు ఇచ్చే నివాళి మాత్రమే కాదు, ఆయన ఆశయాలను భావితరాలకు అందించే గొప్ప నిర్ణయం. అల్లూరి స్ఫూర్తి రెక్కలపై ఆంధ్రప్రదేశ్ ఇక ప్రపంచంతో పోటీపడనుంది,” అని పవన్ అన్నారు. అలాగే జీఎంఆర్ గ్రూపు స్వదేశీ సాంకేతికత, అంకితభావంతో ఈ విమానాశ్రయాన్ని నిర్మించడం తెలుగువారందరికీ గర్వకారణమని ప్రశంసించారు.

**రూ.17,435 కోట్ల వృద్ధి బాట.. అభివృద్ధే లక్ష్యం!**

కేవలం ప్రకటనలు గుప్పించినంత మాత్రాన ఏ దేశమూ, రాష్ట్రమూ అభివృద్ధి చెందదని పవన్ స్పష్టం చేశారు. “ప్రజల కలలను సాకారం చేసే మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే నిజమైన వికాసం సాధ్యమవుతుంది. చరిత్ర మనం నిర్మించిన కట్టడాలను మాత్రమే కాదు.. ఆ కట్టడాల ద్వారా మనం నిర్మించిన భవిష్యత్తును గుర్తుంచుకుంటుంది. ప్రధాని మోదీ నాయకత్వంలో ఈరోజు ఏపీకి రూ.17,435 కోట్ల విలువైన జాతీయ రహదారులు, అభివృద్ధి ప్రాజెక్టులు లభించాయి. విశాఖకు రూ. 2 లక్షల కోట్లు, అమరావతికి రూ. 50 వేల కోట్ల పెట్టుబడులు రావడమే దీనికి నిదర్శనం. ఒకప్పుడు కనీసం ఎర్రబస్సు కూడా సరిగ్గా రాని ప్రాంతానికి ఈరోజు ‘ఎయిర్ బస్’ వచ్చే స్థాయికి మనం చేరుకున్నాం,” అని పవన్ వివరించారు.

**’మోదీని అన్న మాటలకు కన్నీళ్లొచ్చాయి’: పవన్ ఆవేదన**

ప్రధాని మోదీపై కొందరు చేస్తున్న విమర్శలపై పవన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పండ్లున్న చెట్టుకే రాళ్ల దెబ్బలు తగులుతాయని చెబుతూ.. “ఒకప్పుడు భారతదేశం తన పరువు కాపాడుకోవడానికి బంగారం తాకట్టు పెట్టే పరిస్థితి ఉండేది. అలాంటి దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత మోదీది. ప్రధాని అయినప్పటి నుంచి ఆయన ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా శ్రమిస్తున్నారు. ఒకవైపు సరిహద్దుల్లోని విదేశీ శత్రువులతో, మరోవైపు దేశంలో ఉన్న అంతర్గత శత్రువులతో ఆయన పోరాటం చేస్తున్నారు. జంతర్ మంతర్ వద్ద




ఆయనను కొందరు దారుణమైన మాటలు అన్నప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి. తీవ్ర ఆవేదనకు గురయ్యాను. ఈ కొత్త తరానికి ఆయన కష్టం ఏం తెలుసు? 140 కోట్ల మంది జనాభా ఉన్న దేశాన్ని నడిపించడమంటే సామాన్యమైన విషయం కాదు, అదొక ‘రామకార్యం’. నరేంద్ర మోదీని రాజకీయంగా కొట్టేవాడు ఈ దేశంలో లేడు, ఇకపై రాబోడు! అందుకే దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే నేను ఎంతో బలవంతంగా ఈ పొత్తు కోసం ప్రయత్నించాను,” అని పవన్ వ్యాఖ్యానించారు.

**తల్లిదండ్రులకు విజ్ఞప్తి.. ప్రధానికి పాదాభివందనం!**

మోదీ తనను విమర్శించిన వారిని కూడా క్షమించేంత గొప్ప మనసున్న నాయకుడని పవన్ అభివర్ణించారు. “వేలాది మంది తిడుతున్నా, విమర్శిస్తున్నా దేశాన్ని ముందుకు తీసుకెళ్లే ఏకైక సామర్థ్యం మోదీకి ఉంది. 25 ఏళ్లలోపు పిల్లలున్న తల్లిదండ్రులకు నాదొకటే విజ్ఞప్తి.. మన పిల్లలకు దేశం కోసం కష్టపడే నాయకుల విలువను వివరించి, వారిని సరైన మార్గంలో పెట్టడం మనందరి బాధ్యత,” అని పిలుపునిచ్చారు. ప్రసంగం ముగింపులో ప్రధాని మోదీ పాదాలకు నమస్కరిస్తున్నట్లు తెలిపిన పవన్ కల్యాణ్.. “దేశ ప్రజలు వద్దంటేనే మీరు అధికారం దిగాలి తప్ప, మిమ్మల్ని కుర్చీ నుంచి దించే మగాడు ఈ దేశంలోనే లేడు. మా మద్దతు మీకు ఎప్పటికీ ఉంటుంది,” అని స్పష్టం చేశారు.

# డ్రైనేజీ సమస్యపై స్పందించిన డివిజన్ అధ్యక్షులు

## ప్రజల సమస్యల పరిష్కారమే బీజేపీ పార్టీ ధ్యేయం!



**ఆగస్టు 01, ఆల్వాల్, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** ఇందిరానగర్‌లోని కృష్ణా ఎన్‌క్లేవ్, డీమార్ట్ బ్యాక్‌సైడ్ ప్రాంతంలో గత రెండు రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లి రోడ్డుపైకి రావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక ప్రజల నుంచి సమాచారం అందిన వెంటనే సంబంధిత హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై ఒ సీవరేజ్ బోర్డు (హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు) అధికారులతో మాట్లాడి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లాను. మా విజ్ఞప్తికి వెంటనే స్పందించిన అధికారులు ఈరోజే డ్రైనేజీ లైన్‌ను శుభ్రపరచించి, రోడ్డుపై నిలిచిన మురుగునీటిని తొలగించి ప్రజలకు ఉపశమనం కల్పించారు. ప్రజల కష్టాలను గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వెంటనే పరిష్కారం చూపించడమే భారతీయ జనతా పార్టీ కార్యకర్తల బాధ్యత. ప్రజల విశ్వాసమే మా బలం... ప్రజాసేవే మా రాజకీయానికి ప్రాణం. మాటలతో కకాదు చేతలతో ప్రజల నమ్మకాన్ని గెలుచుకుంటాం. ప్రతి సమస్యకు పరిష్కారం ప్రతి కుటుంబానికి అండగా బీజేపీ ఉంటుందని సందర్భంగా ఆల్వాల్ 195వ డివిజన్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షులు గొగూరి శ్రీధర్ రెడ్డి తెలిపారు.

# అత్యంత వైభవంగా గీతం 17వ స్నాతకోత్సవం

**1990 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం.**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ దర్శకుడు రాజమౌళి.**

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01:** పటాన్ చెరు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తన 17వ స్నాతకోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన 1990 మంది విద్యార్థులకు (1532 మంది అండర్ గ్రాడ్యుయేట్, 372 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్, 86 మంది పీహెచ్.డీ. స్కాలర్లు) పట్టాలు ప్రదానం చేశారు.






ప్రపంచ ప్రఖ్యాత భారతీయ చలన చిత్ర దర్శకుడు శ్రీ ఎస్.ఎస్. రాజమౌళి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కాగా, గీతం అధ్యక్షుడు – విశాఖపట్నం లోక్ సభ సభ్యుడు శ్రీ ఎం. శ్రీభరత్ అధ్యక్షత వహించారు. విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారంతా మహాత్మా గాంధీ విగ్రహానికి, గీతం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.వి.వి.ఎస్.మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

ఈ సందర్భంగా, చేనేత రంగంలో విశేష కృషి, భారతదేశపు గొప్ప వస్త్ర వారసత్వాన్ని పరిరక్షించడంలో అందించిన సేవలకు గుర్తింపుగా, భారతీయ చేనేత కళాకారుడు శ్రీ గజం గోవర్ధనకు గీతం గౌరవ డాక్టరేట్ (డీ.లిట్) ప్రదానం చేసింది.

విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం 17 బంగారు పతకాలను అందజేశారు. బీ.టెక్.లోని అన్ని విభాగాలలో టాపర్ గా నిలవడంతో పాటు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఫస్ట్ ర్యాంకు సాధించిన డిగుదాడి ప్రణవ్ రాహుల్ ప్రెసిడెంట్ పేరిట నెలకొల్పిన రెండు బంగారు పతకాలను అందుకున్నారు. అలాగే, పరిశోధన, ఆవిష్కరణల రంగంలో గణనీయమైన కృషి చేసిన 86 మంది పరిశోధక విద్యార్థుల (పీహెచ్.డీ. స్కాలర్లు)కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేసింది.

అత్యుత్తమ పరిశోధన విజయాలకు గాను, గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (అర్థశాస్త్ర విభాగం) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ అర్షద్ అన్సారీ, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ (రసాయన శాస్త్ర విభాగం) ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్రబాబులకు 'ఉత్తమ పరిశోధకుడు' (బెస్ట్ రీసెర్చర్) అవార్డులను అందజేశారు.




ఈ సందర్భంగా శ్రీ రాజమౌళి స్నాతకులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. డాక్టర్ ఎం.వి.వి.ఎస్. మూర్తి తత్వాన్ని గుర్తుచేస్తూ పట్టభద్రులను ఉత్తేజపరిచారు. అచంచలమైన అంకితభావం, అభిరుచి, కఠోర శ్రమ ద్వారా తాము ఎంచుకున్న రంగాలలో శ్రేష్ఠతను సాధించాలని సూచించారు. ప్రతి ప్రయత్నాన్ని నిబద్ధతతో, లక్ష్యంతో కొనసాగించాలని ఆయన పట్టభద్రులను ప్రోత్సహించారు.

తన అధ్యక్షోపన్యాసంలో, శ్రీభరత్ పట్టభద్రులైన విద్యార్థులు అభినందిస్తూ, విజయానికి ఏడు మార్గదర్శక సూత్రాలను వివరిస్తూ రాజమౌళి గారి సందేశాన్ని పునరుద్ఘాటించారు. పెద్ద కలలు కనండి, మిమ్మల్ని మీరు నమ్మండి, గొప్ప వ్యక్తులతో కలిసి ఉండండి. మీ లక్ష్యాల పట్ల అభిరుచితో నిబద్ధతతో ఉండండి. నిరంతరం నేర్చుకుంటూ, ఎదుగుతూ ఉండండి. వినయంగా ఉండండి, ఇచ్చిన మాటను ఎల్లప్పుడూ నిలబెట్టుకోండి అని సలహా ఇచ్చారు. వార్షిక నివేదికను సమర్పిస్తూ, హైదరాబాదులో అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, గీతం సాధించిన విజయాలను వివరించారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణలలో శ్రేష్ఠత ద్వారా సామాజిక బాధ్యత గల నాయకులను తీర్చిదిద్దడంలో విశ్వవిద్యాలయం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించారు. పట్టభద్రులైన విద్యార్థులు నైతిక ప్రవర్తన, వృత్తిపరమైన నైపుణ్యం, దేశ నిర్మాణానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ స్నాతకోత్సవ ప్రతిజ్ఞ చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ వందన సమర్పణ చేశారు.

17వ స్నాతకోత్సవ కార్యక్రమం, విద్యాపరమైన నైపుణ్యం, పరిశోధన, నూతన ఆవిష్కరణలు, విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధి పట్ల గీతం హైదరాబాదు అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబించింది. ఈ కార్యక్రమం ద్వారా పట్టభద్రులైన వారు బాధ్యతాయుతమైన నిపుణులుగా, సమాజంపై అర్థవంతమైన ప్రభావాన్ని చూపగల భవిష్యత్ నాయకులుగా ఎదిగేలా సాధికారత కల్పించింది.

# ఘనంగా చిన్నారి కేశ్విక అన్నప్రాసన మహోత్సవం

## చిన్నారిని ఆశీర్వదించిన డోర్నకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ యువజన నాయకులు డీఎస్ రవిచంద్ర

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 01, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామంలోని వనజీవి రామయ్య ఫంక్షన్ హాల్‌లో డోర్నకల్ మండలం సంకీస గ్రామానికి చెందిన పోగుల వీరబాబు, స్రవంతి, దంపతుల చిన్నారి కేశ్విక అన్నప్రాసన మహోత్సవం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలో చిన్నారికి పెద్దలు ఆశీర్వచనాలు అందించి, ఆమె ఆయురారోగ్యాలు, విద్యాభివృద్ధి, సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను కుటుంబ సభ్యులు ఆత్మీయంగా ఆహ్వానించి సత్కరించారు. అనంతరం అందరికీ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సాగి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు చిరస్మరణీయంగా నిలిచింది. ఈ సందర్భంగా డోర్నకల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు డీఎస్ రవిచంద్ర చిన్నారి కేశ్వికను ఆశీర్వదించి, ఆమె ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, కుటుంబానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. డోర్నకల్ మండలం పేరుమండ్ల సంకీస గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు పోగుల వీరబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. డీఎస్ రవిచంద్రకు అత్యంత ఆప్తుడిగా, నమ్మకస్తుడిగా పేరొందిన పోగుల వీరబాబు విచ్చేసిన అతిథులకు ఆత్మీయంగా స్వాగతం పలికి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాజీ మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ విద్యాసాగర్ మాజీ ఎంపీపీ బాలు నాయక్ బిక్షం రెడ్డి మండలం పార్టీ నాయకులు పెరుమాండ్ల సంకీస బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు చిన్నారిని ఆశీర్వదించి పోగుల కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.





# భువనగిరిలో ఘనంగా వనమహోత్సవం...

**పచ్చని భువనగిరి మన అందరి లక్ష్యం కావాలి...**

**ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భవిష్యత్ తరాలను కాపాడాలి...**

**నాటిన ప్రతి మొక్కను 3 సంవత్సరాల పాటు మున్సిపల్ సిబ్బందితో సంరక్షిస్తాం....**

**హరితవనం కార్యక్రమంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి కుమార్**

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భువనగిరి పట్టణంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందుల్భోగంగా "హరితవనం" పేరుతో మున్సిపల్ పరిధిలో భారీగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష.. హరిత తెలంగాణ ను సాధించడమే మనందరి ధ్యేయం. కాలుష్యాన్ని తగ్గించి, స్వచ్ఛమైన గాలి అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటాలి. భువనగిరి నియోజకవర్గాన్ని పచ్చదనంతో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం" అని అన్నారు. చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి కుమార్ మాట్లాడుతూ..."పట్టణాన్ని పచ్చదనంతో అభివృద్ధి చేయడమే మన ప్రథమ లక్ష్యం.. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని వార్డుల్లో, పార్కుల్లో, రోడ్ల పక్కన వేలాది మొక్కలు నాటాం. నాటిన ప్రతి మొక్కను 3 సంవత్సరాల పాటు మున్సిపల్ సిబ్బందితో సంరక్షిస్తాం. 'ఒక ఇల్లు – ఒక మొక్క' అనే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించి ప్రతి ఇంటికి మొక్కలు అందిస్తాం. ప్రజలందరూ ఈ హరిత ఉద్యమంలో భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని బ్రతికించే బాధ్యత కూడా తీసుకోవాలని కోరుతున్నాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ తంగళ్ళపల్లి రవికుమార్ మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ , జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోతాంశెట్టి మంజుల, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం.**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, జహీరాబాద్ :**
తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అనిశ్చితిలో పడిందని, రెండు సంవత్సరాలకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం అన్నారు. ఫలితంగా అనేక ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేస్తు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికేట్లు ఇవ్వకుండా మానసికకంగా వేదిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులను, కళాశాలలను ఈ సంక్షోభం నుంచి బయటపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.7వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ పరిస్థితి వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు కోల్పోతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేసిన కళాశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్లు అందేలా ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలని, బీఆర్ఎస్ పార్టీ విద్యార్థులకు అండగా ఉండి వారి హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, రాంచంద్రారెడ్డిలు ఉన్నారు.

# బొల్లారం సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఎం.ఆర్.ఎల్ రాజు

**క్యాంపు కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే**




**ఆగస్టు 01, పికెట్, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ని శనివారం పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సి.ఐ కు శుభాకాంక్షలు తెలిపుతు ప్రజలతో మంచి సంబంధాలు నెరిపి బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించాలని వరుసగా బోనాలు వస్తున్నందున శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టి ప్రజల మన్ననలు అందుకుని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సీఐ కీ తెలిపారు.

# సర్వాయి పాపన్న మోకు దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కె వీరాస్వామి గౌడ్ జన్మదినం

## శుభాకాంక్షలు తెలిపిన బైరి విశ్వనాథం గౌడ్, పూదరి సంతోష్ కుమార్ గౌడ్

**ఆగస్టు 01, జమ్మికుంట, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**



అక్షర యోధుడు – మన వీరస్వామి అన్న స్వేచ్ఛకు ప్రతిరూపం నీ నవ్వు, సేవాభావానికి నిలువెత్తు నిదర్శనం నీవు! న్యాయం వైపే సాగే నీ అడుగులు, అందరి మదిలో నిలిచాయి నీ మంచితనపు వెలుగులు! గౌడ వంశపు తేజానివై, ప్రజా సంక్షేమమే ఊపిరిగా జీవిస్తూ, కష్టాల్లో ఉన్నవారికి మంచి మనస్సుతో అందరినీ ఆదరిస్తూ అక్షరాలై నిలిచే నీ కీర్తి, పోరాటాల్లో చూపించే నీ తెగువ ప్రజల గుండెల్లో నీ స్థానం శాశ్వతం, నీ బాటలో నడవడం మాకందరికీ గర్వకారణం,జక్కె వీరాస్వామి గౌడ్ శనివారం రోజు జన్మదినం సందర్బంగా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని,సదా సంతోషంతో, మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీ. ఆర్.9 టీవీ న్యూస్ ఛానల్ యాదాద్రి భువనగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మరియు సీనియర్ జర్నలిస్ట్ భైరి. విశ్వనాథం గౌడ్, టీ.ఆర్. 9 టీవీ న్యూస్ ఛానల్ ప్రతినిధి సంతోష్ కుమార్ పూదరి గౌడ్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ సంఘం తెలంగాణ రాష్ట్ర జిల్లా. మండల అధ్యక్షులు, కార్య వర్గ సభ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## వీకర్ సెక్షన్ కాలనీలో భారీ షెడ్ నిర్మాణం

### అక్రమ నిర్మాణ పనులను పట్టించుకోని అధికారులు



**ఆగస్టు 01, కొంపల్లి, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
దూలపల్లి డివిజన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో నిర్మిస్తున్న భారీ షెడ్ స్థానికుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. కాలనీ మధ్యలో భారీ నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, షెడ్ నిర్మాణం వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో పాటు భవిష్యత్తులో భద్రతా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో జరుగుతున్న నిర్మాణం చట్టబద్ధమైనదేనా? అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు వెంటనే విచారణ చేపట్టి, అక్రమ నిర్మాణమైతే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సమస్య మరింత తీవ్రమయ్యేలోపు సంబంధిత శాఖలు స్పందించి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## గౌరారంలో పి.జె.టి.ఎ.యు, రాజేంద్రనగర్ వ్యవసాయ విద్యార్థుల గ్రామీణ అధ్యయన కార్యక్రమం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, గౌరారం (సిద్దిపేట):**
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పి.జె.టి.ఎ.యు, రాజేంద్రనగర్) 4వ సంవత్సరం విద్యార్థులు తమ 'రావెప్' అధ్యయనంలో భాగంగా సిద్దిపేట జిల్లా గౌరారం గ్రామంలో 'పాల్గొనే గ్రామీణ అంచనా' (పి.ఆర్.ఎ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్థానిక రైతులతో కలిసి గ్రామానికి చెందిన భౌగోళిక నమూనా, సాగు భూములు మరియు నీటి వనరులను ప్రతిబింబించే సామాజిక మ్యాపింగ్‌ను ప్రదర్శించారు. అనంతరం పంట దిగుబడుల పెంపు, చీడపీడల నివారణ మరియు ఆధునిక సాగు పద్ధతులపై రైతులతో ముఖాముఖి నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నగరం కనకరాజు గౌడ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, టి.ఆర్.వి.కే సీనియర్ సైంటిస్ట్ మరియు 'రావెప్' ఇన్‌చార్జ్ పల్లవి, స్థానిక గ్రామ పెద్దలు, రైతులు మరియు వ్యవసాయ విద్యార్థినులు పూజ, డోనా మరియా, ఇషిక, నందిత, వర్ష, షాలిని పాల్గొన్నారు.

## పశువుల వల్ల ఎంతోమంది మృతి చెందారు.!

### రహదారిపై భద్రతా ప్రమాణాలు పాటించాలి. ప్రతి ఒక్కరి బాధ్యత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:**
సహజంగా రహదారుల పై పశువులు విశ్రాంతి తీసుకోవడం వల్ల ట్రాఫిక్ అంతరాయమే కాకుండా ఒకోసారి ప్రాణాంతక ప్రమాదాలు జరుగుతున్నాయి.దీని కారణంగా వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో రోడ్ల పై పశువులు కన్పించక వాహనాలు ఢీకొనే ఘటనలు అధిఖం. రోడ్డు ప్రమాదం జరిగి గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. దీని వల్ల మూగ జీవాలు తమ ప్రాణాలను కోల్పోయిన ఘటనలు అనేకం చర్ల మండలం తేగడ తాలి పేరు వంతెన పై ఓ పశువు ఎవరికి ఇబ్బంది లేకుండా ఎంచక్కా రహదారి పక్కన ఖాళీ గా ఉన్న ఫుట్ పాత్ పై సేద తీరుతోంది. దీని వల్ల రోడ్డు ప్రమాదాలు జరగవు. ట్రాఫిక్ జామ్ కాదు. ఈ మూగ జీవాన్ని చూసైనా మనం భద్రతా ప్రమాణాలను పాటిద్దాం.

## కన్నీళ్లలో తోడుండేదే నిజమైన స్నేహం!.

సంతోషంలో నవ్వుతూ, కష్టంలో చేయి పట్టి నడిచేవారు నిజమైన స్నేహితులు

జాతీయ స్నేహ దినోత్సవం శుభాకాంక్షలు

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, తెలంగాణ బ్యూరో : మనిషి జీవితంలో కుటుంబ సంబంధాలతో పాటు స్నేహబంధాలకు కూడా ప్రత్యేకమైన స్థానం ఉంది. మన ఆనందంలో మనతో కలిసి నవ్వుతూ, విజయాల్లో మనకంటే ఎక్కువగా సంతోషిస్తూ, అపజయాల్లో ధైర్యం చెబుతూ, కష్టకాలంలో చేయి విడవకుండా అండగా నిలిచే వ్యక్తే నిజమైన స్నేహితుడు.

జీవిత ప్రయాణంలో మనతో పాటు నడిచిన స్నేహితుల విలువను గుర్తుచేసుకోవడానికి, వారి ప్రేమ – ఆప్యాయతలను స్మరించుకోవడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు నెల మొదటి ఆదివారం జాతీయ స్నేహ దినోత్సవం జరుపుకుంటారు. 2026 సంవత్సరంలో ఈ ప్రత్యేక దినోత్సవం ఆగస్టు 2, ఆదివారం నాడు వచ్చింది.

జాతీయ స్నేహ దినోత్సవం కేవలం శుభాకాంక్షలు చెప్పుకునే రోజు మాత్రమే కాదు. మన జీవితంలో ముఖ్యమైన పాత్ర పోషించిన స్నేహితులను గుర్తుచేసుకోవడానికి, వారికి కృతజ్ఞతలు తెలియజేయడానికి, కాలం మరియు పరిస్థితుల కారణంగా దూరమైన మిత్రులతో మళ్లీ కలవడానికి ఇది ఒక ఆత్మీయ సందర్భం.

స్నేహం… జీవితానికి ఒక బలం:

జీవితంలో ప్రతి సందర్భంలో మనతో ఉండే వారందరూ నిజమైన స్నేహితులు కాకపోవచ్చు. మన సంతోషంలో భాగస్వాములు కావడంతో పాటు, కష్టసమయంలో మన చేయి పట్టుకుని "నేనున్నాను" అని ధైర్యం చెప్పేవారే నిజమైన మిత్రులు.

మన బాధను ఓపికగా వినడం,మన తప్పులను ప్రేమతో సరిదిద్దడం, సరైన మార్గంలో నడిపించడం, అవసరమైనప్పుడు నిజాయితీగా సలహా ఇవ్వడం,మనం పడిపోయినప్పుడు చేయి అందించి మళ్లీ నిలబెట్టడం–ఇవన్నీ నిజమైన స్నేహానికి ప్రతీకలు.

ఒక మంచి స్నేహితుడు జీవితంలో ఎంతో విలువైన సంపద. డబ్బుతో కొనలేని అనుబంధం స్నేహం. కాలం



మారినా… పరిస్థితులు మారినా, దూరాలు పెరిగినా, నిజమైన స్నేహం మాత్రం మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. అందుకే స్నేహాన్ని జీవితానికి బలమైన ఆధారంగా భావిస్తారు.

నేటి సమాజంలో స్నేహం అవసరం:

ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతికత అభివృద్ధి చెందడంతో సోషల్ మీడియా ద్వారా వేలాది పరిచయాలు ఏర్పడుతున్నాయి. ఫోన్‌లో వందలాది కాంటాక్టులు, సోషల్ మీడియాలో వేలాది మంది స్నేహితులు, ఫాలోవర్స్ ఉన్నప్పటికీ, కష్టసమయంలో మనకు అండగా నిలిచే నిజమైన స్నేహితుడు ఎంతమంది ఉన్నారనే ప్రశ్న ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అంశం.

నేటి రోజుల్లో పరిచయాలు పెరుగుతున్నప్పటికీ, మనుషుల మధ్య ప్రత్యక్ష సంభాషణలు, ఆప్యాయతలు, ఆత్మీయ పలకరింపులు తగ్గుతున్నాయని చాలామంది భావిస్తున్నారు. ఈ పరిస్థితిలో నిజమైన స్నేహబంధాలను కాపాడుకోవడం మరింత అవసరం.

ఒక చిన్న ఫోన్ కాల్, ఆప్యాయమైన సందేశం,ఎలా ఉన్నావు?" అనే పలకరింపు… కొంత సమయం కేటాయించడం–ఇలాంటి చిన్న చర్యలే స్నేహబంధాన్ని మరింత బలపరుస్తాయి.

జాతీయ స్నేహ దినోత్సవం మన బిజీ జీవితంలో కొంత సమయాన్ని స్నేహితుల కోసం కేటాయించాలని గుర్తుచేస్తుంది. చాలాకాలంగా మాట్లాడని స్నేహితుడికి ఒకసారి ఫోన్ చేయడం, అతని యోగక్షేమాలు అడగడం, పాత జ్ఞాపకాలను పంచుకోవడం ద్వారా మరిచిపోయిన అనుబంధాలకు మళ్లీ జీవం పోయవచ్చు.

**స్నేహం ఇచ్చే ఆనందం:**

మంచి స్నేహితులతో మన భావాలను పంచుకోవడం వల్ల మనసుకు ప్రశాంతత కలుగుతుంది. సంతోషాన్ని స్నేహితులతో పంచుకుంటే అది మరింత పెరుగుతుంది… బాధను పంచుకుంటే అది కొంత తేలికవుతుంది.జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని మంచి స్నేహం అందిస్తుంది. మనలోని మంచి లక్షణాలను వెలికితీసి, మన సామర్థ్యాన్ని గుర్తించి, ముందుకు సాగేందుకు ప్రోత్సహించేది నిజమైన మిత్రత్వం.విద్యార్థి జీవితంలో మంచి స్నేహితులు చదువులో ప్రోత్సాహం ఇస్తారు. ఉద్యోగ జీవితంలో మిత్రులు అనుభవాలను పంచుకుంటూ సహకరిస్తారు. కుటుంబ జీవితంలో కూడా ఆత్మీయ మిత్రుల సలహాలు, సహాయం ఎంతో ఉపయోగపడతాయి.

**నిజమైన స్నేహం లక్షణాలు:**

నిజమైన స్నేహం విశ్వాసం, నిజాయితీ, ప్రేమ, గౌరవం, పరస్పర సహకారంపై నిర్మితమవుతుంది. స్నేహితుడి విజయాన్ని చూసి అసూయపడకుండా హృదయపూర్వకంగా ఆనందించడం, అతని తప్పులను ప్రేమతో సరిదిద్దడం, అవసరమైనప్పుడు సహాయం చేయడం… కష్టకాలంలో వెన్నుదన్నుగా నిలవడం నిజమైన స్నేహితుడి లక్షణాలు.

స్నేహం అంటే కేవలం కలిసి తిరగడం, నవ్వుకోవడం లేదా వినోదం పంచుకోవడం మాత్రమే కాదు. ఒకరి భావాలను మరొకరు అర్థం చేసుకోవడం, పరస్పరం గౌరవించుకోవడం, అవసరమైనప్పుడు నిజాన్ని చెప్పడం, ఒకరి అభివృద్ధికి మరొకరు తోడ్పడటం కూడా స్నేహంలో భాగమే.

**స్నేహ దినోత్సవాన్ని ఎలా జరుపుకోవాలి?:**

చాలాకాలంగా కలవని పాత స్నేహితులను పలకరించడం,చిన్న సమావేశం ఏర్పాటు చేయడం,కలిసి గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం ద్వారా ఈ రోజును మరింత ఆనందంగా జరుపుకోవచ్చు. ప్రస్తుతం చాలామంది సోషల్ మీడియా ద్వారా స్నేహితులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అయితే కేవలం సందేశం పంపడం కంటే, ఒకసారి ఫోన్ చేసి వారి యోగక్షేమాలు అడగడం అవసరమైన సమయంలో సహాయం చేయడం కష్టాల్లో అండగా నిలవడం స్నేహానికి మరింత గొప్ప అర్థాన్ని ఇస్తుంది.

**జీవితంలో లభించే అత్యంత విలువైనది స్నేహం:**

స్నేహం అనేది జీవితంలో లభించే అత్యంత విలువైన బహుమతి. మన ఆనందంలో చిరునవ్వుగా,మన బాధలో ఓదార్పుగా,మన అపజయాల్లో ధైర్యంగ,జీవిత ప్రయాణంలో చేయి విడవని తోడుగా నిలిచే నిజమైన స్నేహితుడు ఉండటం ఒక గొప్ప అదృష్టం.

ఈ స్నేహ దినోత్సవం సందర్భంగా మనం ఒక మంచి సంకల్పం చేద్దాం. కులం, మతం, భాష, ప్రాంతం, ఆర్థిక స్థితి అనే భేదాలకు అతీతంగా ప్రేమ, మానవత్వం, పరస్పర గౌరవంతో స్నేహబంధాలను పెంపొందిద్దాం. ఒంటరిగా బాధపడుతున్నవారిని పలకరిద్దాం. కష్టాల్లో ఉన్నవారికి ధైర్యం చెప్పుదాం. చిన్న అపార్థాల వల్ల దూరమైన స్నేహితులతో మళ్లీ కలుద్దాం.

స్నేహం మనుషులను కలిపే శక్తి, ప్రేమను పంచే బంధం, సమాజంలో ఐక్యతను పెంచే విలువ. మన స్నేహం మాటల్లో మాత్రమే కాకుండా, అవసరమైన సమయంలో సహాయం చేసే చేతుల్లో కనిపించాలి.

ఒక్క మంచి స్నేహితుడు ఒక జీవితానికి ధైర్యము.

ఒక్క మంచి స్నేహబంధం ఒక సమాజానికి ఐక్యత.

అందరం కలిసి ప్రేమను పంచుదాం.

మానవత్వాన్ని పెంచుదాం.

అవసరంలో ఉన్నవారికి అండగా నిలుద్దాం.

స్నేహంతో సమాజాన్ని మరింత అందంగా తీర్చిదిద్దుదాం.

స్నేహాన్ని కాపాడుకుందాం… మానవత్వాన్ని పెంచుదాం… సమాజాన్ని ఐక్యంగా నిలుపుదాం.

ఈ జాతీయ స్నేహ దినోత్సవం సందర్భంగా మన జీవితాన్ని అందంగా తీర్చిదిద్దిన స్నేహితులను గుర్తుచేసుకుందాం. వారికి ప్రేమతో కృతజ్ఞతలు తెలియజేద్దాం. చిన్న అపార్థాల వల్ల దూరమైన మిత్రులతో మళ్లీ కలుద్దాం. విశ్వాసం, నిజాయితీ, ప్రేమ, పరస్పర గౌరవంతో స్నేహబంధాలను మరింత బలోపేతం చేసుకుందాం.

**జాతీయ స్నేహ దినోత్సవ శుభాకాంక్షలు!**




**వ్యాసకర్త :**
**వేల్పుల మహేందర్,**
**ఏం. ఎస్సీ, ఏం.ఏ, ఎం.ఈ.డి**
**అధ్యాపకులు...9912775834.**


## అజిత్ దోబాల్ కు లోకమాన్య తిలక్ అవార్డు: అమిత్ షా ప్రశంసలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, సెంట్రల్ బ్యూరో :**
నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ దోబాల్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించారు. భారత విదేశాంగ విధానం, జాతీయ భద్రత అంశంలో ఆయన పాత్ర మరువలేనిదని కొనియాడారు. 2014 నుంచి దేశ భద్రత, భవిష్యత్తు కోసం ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న ప్రతి చిన్న నిర్ణయం వెనుక అజిత్ దోబాల్ ఉన్నారని తెలిపారు. ఈ మేరకు శనివారం పుణెలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా దోబాల్ ప్రతిష్ఠాత్మక లోకమాన్య తిలక్ అవార్డును అందుకున్నారు. అనంతరం అమిత్ షా ప్రసంగించారు. దోబాల్ సేవలను గుర్తు చేశారు.జాతీయ భద్రతను మరింత దృఢంగా మార్చే విషయంలో నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ దోబాల్ వ్యూహాత్మక సూచనలు, సలహాలు ఎంతో విలువైనవి.. రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంలో ఆయన తన సహకారం అందించారని అమిత్ షా కొనియాడారు. ఆయన కృషికి గానూ భారత చరిత్రలో ఒక గోల్డెన్ పేజీ అజిత్ దోబాల్ కు ఉంటుందని ప్రశంసించారు. " భారత విదేశాంగ విధానాన్ని బలోపేతం చేయడంలో అజిత్ దోబాల్ కృషి మరువలేనిది. ఎప్పుడైనా చరిత్రను లిఖిస్తే.. అంతర్గత భద్రత, బహిర్గత భద్రత గురించి మాట్లాడితే అజిత్ దోబాల్ కు గోల్డెన్ పేజీ ఎప్పుడూ ఉంటుంది. ఇందులో ఎలాంటి అనుమానం లేదు" అని అమిత్ షా స్పష్టం చేశారు.2014 లో దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత



తీసుకున్న తొలి నిర్ణయాల్లో ఒకటి అజిత్ దోబాల్ ను జాతీయ భద్రతా సలహాదారుగా నియమించడం అని అమిత్ షా స్పష్టం చేశారు. ప్రస్తుతం భారత విదేశాంగ విధానం అత్యుత్తమ స్థాయిలో ఉంది. మనం మన స్థానాన్ని ప్రపంచంలో సుస్థిరంగా ఏర్పాటు చేసుకున్నాం.. అని అమిత్ షా పేర్కొన్నారు. 2014 లో అజిత్ దోబాల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ లో ఆధునిక హంగులు దిద్దడంలో.. టెక్నాలజీని అభివృద్ధి చేయడంలో ఆయన పాత్ర మరువలేనిది.. అని తెలిపారు.

**అజిత్ దోబాల్ కృషిని ఎప్పుడూ ప్రజల ముందు పెట్టలేదు.**

అందుకు ఇంటెలిజెన్స్, భద్రతా పరమైన కారణాలు ఉన్నాయని అమిత్ షా స్పష్టం చేశారు. తాను గుజరాత్ హోమ్ మంత్రిగా ఉన్నప్పుడు అహ్మదాబాద్ సీరియల్ బాంబ్ బ్లాస్ట్ ఘటన సమయంలో అజిత్ దోబాల్ తో చర్చించిన అంశాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ.. గుజరాత్ పోలీసులకు ఒక్కటే సూచన చేశారని.. అజిత్ దోబాల్ చెప్పినట్లు చేయాలని తెలిపినట్లు అమిత్ షా గుర్తుచేసుకున్నారు."అజిత్ దోబాల్ మా ఇంటికి వచ్చిన సంగతి నాకు ఇంకా గుర్తుంది. ఆయన ఇచ్చిన సూచనలు, సలహాలతో గుజరాత్ పోలీసులు కేవలం అహ్మదాబాద్ బాంబ్ దాడులు మాత్రమే కాదు.. దేశవ్యాప్తంగా 13 బాంబ్ బ్లాస్ట్ ఘటనలను ఛేదించారు. ఇది అతి పెద్ద విజయం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

# బిజెవైఎం ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం...

**ఓటుకు నోటు దొంగవి నువ్వు.. విద్యార్థులను అవమనపరుస్తావా?**

**సిఎం రేవంత్ రెడ్డి వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి**

**విద్యారుల ఓట్లతోని గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి**

**విద్యారులను అవమానపరచడం సిగ్గుచేటు**

**బిజెవైఎం యాదాద్రి జిల్లా అధ్యక్షులు దయ్యాల కుమార స్వామి**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భారతీయ జనతా యువ మోర్చా యాదాద్రి జిల్లా అధ్యక్షులు దయ్యాల కుమార స్వామి ఆధ్వర్యంలో భువనగిరి వినాయక చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. నిన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను క్రిమినల్ వెస్ట్ అన్నందుకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి బిజెవైఎం యాదాద్రి జిల్లా అధ్యక్షులు దయ్యాల కుమారస్వామి మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి అని చెపుతూ విద్యార్థులను అవమనపరచడం బీటెక్ విద్యార్థులను క్రిమినల్ వెస్ట్ అనడం చాలా బాధాకరం వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పెద్ద క్రిమినల్ రేవంత్ రెడ్డి మీద 96 క్రిమినల్ కేసులు ఉన్నాయి. నువ్వు ఓటుకు నోటు దొంగవి నువ్వు విద్యార్థులను అవమనపరుస్తావా....?విద్యారుల ఓట్లతోని గద్దెనెక్కి ఈరొజు విద్యారులను అవమానపరిచిన రేవంత్ రెడ్డి విద్యార్థులకు క్షమాపణ చెప్పుకుంటే నిన్ను తెలంగాణలో ఎక్కడ తిరగనియ్యకుండా బీజేవైయం ఆధ్వర్యంలో అడ్డుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీజేపీ పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, బీజేవైయం పట్టణ అధ్యక్షులు మామిడోజు పవన్ కుమార్, బీజేవైయం జిల్లా నాయకులు బూర్గు మణికంఠ, బుంగమట్ల మహేష్, గుర్రం ప్రవీణ్ రెడ్డి, బండి మహేష్, సాయికుమార్, రావుల సంతోష్, టిల్లు యాదవ్, సూదగని విజయ్, పృద్వి, ఉడుత భాస్కర్, తుమ్మల నగేష్, పవన్, విజయ్, అజయ్, నరేష్, భారత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

**బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్టాత్మక కార్యక్రమాలు - ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్.**

**ఆపరేషన్ ముస్కాన్-12 ద్వారా సంగారెడ్డి జిల్లాలో 173 మంది బాల కార్మికులకు విముక్తి.**

**బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకున్న 136 మంది యజమానులపై కేసులు నమోదు..**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని, జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేర్లతో విస్తృత తనిఖీలు చేపట్టి బాల కార్మికులను గుర్తించి, రక్షించడం జరుగుతుందని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపిఎస్. తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్--12లో భాగంగా గత నెల జూలై 1 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో 173 మంది బాల కార్మికులను రక్షించడం జరిగిందని, వీరిలో 168 మంది బాలురు, 05 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. బాలలను చట్టవిరుద్ధంగా పనిలో పెట్టుకున్న 136 మంది యజమానులపై కేసులు నమోదు చేసి, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. రక్షించిన బాలలను సంబంధిత శాఖల సమన్వయంతో పునరావాసం కల్పించి, విద్యాభ్యాసం కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాలల హక్కులను పరిరక్షించడం, వారికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్--12ను విజయవంతం చేయడంలో పోలీసు శాఖ, కార్మిక శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, విద్యాశాఖ, మెడికల్ డిపార్ట్మెంట్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయం అభినందనీయం అన్నారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలను పనిలో పెట్టుకోవడం, వెట్టిచాకిరి చేయించడం, బలవంతంగా భిక్షాటన చేయించడం, పశువుల కాపరులుగా, కిరాణా



దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫారాలు, పరిశ్రమలు లేదా ఇతర పనులు చేయడం చట్టరీత్యా నేరమని అదనపు ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపించినా లేదా బాలలపై వేధింపులు, దోపిడీ జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే చైల్డ్ హెల్ప్లైన్ -- 1098 లేదా డయల్--100కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# దేశ ఖజానాకు కాసుల వర్షం: 14 నెలల్లో ఇదే ఆల్ టైమ్ రికార్డ్!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, సెంట్రల్ డెస్క్ :**
భారత ఆర్థిక వ్యవస్థ మరోసారి తన సత్తా చాటింది. దేశీయంగా వ్యాపార లావాదేవీలు పుంజుకోవడంతో పాటు దిగుమతులు గణనీయంగా పెరగడంతో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు ఆకాశాన్ని తాకాయి. గత జూలై నెలకు గాను ఏకంగా రూ. 2.11 లక్షల కోట్ల భారీ ఆదాయం సమకూరింది. గడిచిన 14 నెలల కాలంలో నమోదైన అత్యంత వేగవంతమైన వృద్ధి రేటు ఇదే కావడం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 2 లక్షల కోట్ల దాటడం ఇది రెండోసారి. గత ఏడాదితో పోలిస్తే జూలై నెలలో మొత్తం జీఎస్టీ రాబడి ఏకంగా 15.4 శాతం వృద్ధి నమోదు చేసింది. ప్రధానంగా విదేశాల నుంచి వచ్చిన దిగుమతులపై వచ్చే పన్ను ఏకంగా 28.8 శాతం పెరిగి రూ. 66,511 కోట్లకు చేరింది. దీనికి తోడు దేశీయ వ్యాపార లావాదేవీల ద్వారా లభించే ఆదాయం కూడా 10.1 శాతం వృద్ధితో రూ. 1.45 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది దేశంలో ప్రజల కొనుగోలు శక్తి, ఆర్థిక కార్యకలాపాలు ఎంత ముమ్మరంగా సాగుతున్నాయో స్పష్టం చేస్తోంది.

**జూన్ కంటే మెరుగ్గా.. ఆర్థిక సంవత్సరంలో రెండోసారి రికార్డ్**

జూన్ నెలలో జీఎస్టీ రాబడి రూ. 1.95 లక్షల కోట్లుగా నమోదు కాగా, జూలై నాటికి ఇది రూ. 2.11 లక్షల కోట్లకు చేరుకుని రికార్డు సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆరంభంలో (ఏప్రిల్‌లో) ఆల్‌టైమ్ రికార్డు స్థాయిలో రూ. 2.43 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైంది. ఆ తర్వాత మే నెలలో రూ. 1.94 లక్షల కోట్లు, జూన్‌లో రూ. 1.95 లక్షల కోట్లు వసూలు కాగా.. జూలైలో మళ్లీ రూ. 2 లక్షల కోట్ల మార్కును దాటి దూసుకెళ్లింది.

**రీఫండ్లు పోను నికర ఆదాయం ఎంతంటే?**

వ్యాపారులకు చెల్లించిన రీఫండ్లను తీసివేసిన తర్వాత జూలైలో ప్రభుత్వానికి వచ్చిన నికర జీఎస్టీ రాబడి రూ. 1.81 లక్షల కోట్లుగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే




ఇది 15.8 శాతం ఎక్కువ. ఈ నెలలో మొత్తం రూ. 29,968 కోట్ల మేర రీఫండ్లు జారీ చేశారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి నాలుగు నెలల (ఏప్రిల్-జూలై) కాలాన్ని పరిశీలిస్తే, మొత్తం జీఎస్టీ రాబడి 10.1 శాతం పెరిగి రూ. 8.43 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయానికి రూ. 7.66 లక్షల కోట్లు మాత్రమే వసూలు కాగా, ఈ ఏడాది స్థిరమైన వృద్ధితో కేంద్ర, రాష్ట్ర ఖజానాలు కళకళలాడుతున్నాయి.

# గర్భం దాల్చిన 14 ఏళ్ల మనవరాలు.. తాత కామదాహానికి బలి.!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, ములుగు జిల్లా :** సమాజం తలదించుకునే అత్యంత దారుణమైన ఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కంటికి రెప్పలా కాపాడాల్సిన సొంత తాతే.. కామాంధుడిగా మారి తన 14 ఏళ్ల మైనర్ మనవరాలిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చిన్ననాటి నుంచి ఆలనాపాలన చూసుకున్న వ్యక్తే రాక్షసుడిగా మారి ఆ చిన్నారి జీవితాన్ని చిదిమివేశాడు. ప్రస్తుతం ఆ బాలిక నాలుగు నెలల గర్భంతో ఉన్నట్లు వైద్య పరీక్షల్లో తేలడంతో ఈ ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది.

**పోలీసుల వివరాల ప్రకారం..**

వాజేడు మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని ఆమె సొంత తాత పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని బయట ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ తీవ్రంగా బెదిరిస్తూ దారుణానికి ఒడిగట్టినట్లు బాధితురాలు తెలిపింది. ఇలా ఉండగా.. ఇటీవల బాలిక తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించగా, బాలిక నాలుగు నెలల గర్భవతి అని నిర్ధారించారు. ఈ విషయం తెలిసి కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అనంతరం బాలికను ఆరా తీయగా, తన తాత చేసిన దారుణాన్ని కన్నీటిపర్యంతమై కుటుంబ సభ్యులకు వివరించింది. ఈ ఘటనతో ఉలిక్కిపడిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి నాయినమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోక్సో చట్టంతో పాటు సంబంధిత పలు సెక్షన్ల కింద కేసు ఫైల్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సమాచార



# గ్రామ చిత్రపటాన్ని నిర్మించి గ్రామ యొక్క స్థితిగతులను ప్రజలకు రైతులకు వివరించిన విద్యార్థులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, సిద్దిపేట జిల్లా :**
శనివారం రోజు శేరిపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గత నెలలో వారి కోర్సులో భాగంగా రాజేంద్రనగర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ బిఎస్సి అగ్రికల్చర్ నాలుగో సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు వచ్చినారు. శనివారం నాడు వారి ఆధ్వర్యంలో గ్రామ సమాచారాన్ని మొత్తం చార్ట్స్ రూపంలో మరియు గ్రామ చిత్రపటాన్ని నిర్మించి గ్రామ యొక్క స్థితిగతులను ప్రజలకు రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి యర్ర పావని మోహన్ రెడ్డి వారి యొక్క ప్రాజెక్టు ఆఫీసర్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ పల్లవి రెడ్డి, ప్రియదర్శిని, మాజీ ఎంపీటీసీ ఎర్ర కొండల్ రెడ్డి మాజీ సర్పంచ్ కొల్ల కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, రైతులు, మహిళలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ కారుల సంఘం...

**తుర్కపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా భూక్యా రమేష్ నాయక్ నియామకం**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల సంఘం తుర్కపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బిల్యా నాయక్ తండా గ్రామ పంచాయతీకి చెందిన భూక్యా రమేష్ నాయక్ ని నియమించినట్లు తుర్కపల్లి మండల ఉద్యమ కారుల సంఘం మండల అధ్యక్షుడు కోట సురేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల సంఘం రాష్ట అధ్యక్షుడు పూస శ్రీనివాస్ శనివారం నాడు భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన ఉద్యమకారుల సమావేశంలో నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. నియామక పత్రాన్ని అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియా శీలకంగా పాల్గొన్న ప్రతి ఉద్యమ కారునికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు 30 వేల రూపాయల పింఛన్ సౌకర్యంతో పాటు ప్రతి ఉద్యమ కారునికి గుర్తింపు కార్డులు ఇచ్చి గౌరవించాలని అన్నారు ప్రతి ఒక్క ఉద్యమ కారునికి న్యాయం జరిగేంత వరకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కారుల సంఘం రాష్ట ప్రధాన కార్యదర్శి జంపాల శ్రీనివాస్, ఉద్యమ కారుల సంఘం స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ జి, కృష్ణయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు సీస మహేశ్వరి, ఉద్యమ కారుల సంఘం జిల్లా నాయకుడు, తెలంగాణ ఉద్యమ కారుడు ఎరుకల వెంకటేష్ గౌడ్, నల్ల రాజు తదితరులు ఉన్నారు

# వినియోగదారులకు రిలీఫ్..తగ్గిన సిలిండర్ ధరలు.!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, సెంట్రల్ డెస్క్:** గ్యాస్ వినియోగదారులకు బిగ్ రిలీఫ్ దక్కింది. తాజాగా కమర్షియల్ సిలిండర్ ధరలను తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో పెరిగిన కమర్షియల్ సిలిండర్ ధరలు... క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఆగస్టు ఒకటవ వచ్చిన నేపథ్యంలో ఇవాళ కూడా కమర్షియల్ సిలిండర్ ధరలను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇక తాజా సవరణతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధరపై రూ.202 తగ్గించారు. కోల్ కతాలో రూ. 209 తగ్గింది. ఈ క్రమంలో కోల్‌కతాలో వాణిజ్య సిలిండర్ ధర నేటి నుంచి రూ. 2,872.50గా ఉంటుంది. అయితే గృహ వినియోగదారులు ఉపయోగించే 14.2 కిలోల డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు చేయలేదు. కొత్త ధరలు నేటి నుంచి అమలులోకి రానున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

## ఆత్మ కమిటీ డైరెక్టర్ జింకల ఎల్లేష్ యాదవ్ కి ఘనంగా సన్మానం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన జింకల ఎల్లేష్ యాదవ్ ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గంధమల్ల గ్రామ సర్పంచ్ బొత్త రాములు, ఉపసర్పంచ్ గుమ్మడి బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గజం వంశీ, వార్డ్ సభ్యులు జెల్ల గణేష్, గడిపే నర్సింలు, కలకుంట్ల రజిత, నాయకులు జక్కుల శ్రీశైలం, సిరిగిరి వెంకటేష్, ఆలేటి శ్రీశైలం, జూపల్లి తిరుపతి, ఆవుల కృష్ణమూర్తి, కలకుంట్ల, బాలయ్య,కలకుంట్ల, శ్రీకాంత్, బాధిని బాలయ్య తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## మొక్కలను పంపిణీ చేసిన సర్పంచ్ జెన్నపల్లి బాలరాజ్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** వనమహోత్సవంలో భాగంగా రాజపేట మండలం మల్లగూడెం గ్రామంలో ప్రతి ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సర్పంచ్ జెన్నపల్లి బాలరాజ్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించి ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జెన్నపల్లి బాలరాజ్ రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీమతి రెడ్డబోయిన కవిత, వార్డు సభ్యులు, శ్రీమతి నీల కనకమ్మ, గొడుగు బ్రహ్మయ్య, నీల జహంగీర్, శ్రీమతి గొడుగు కల్పన, బోయిని నాగరాజు, పంచాయతీ కార్యదర్శి కొండ చక్రధారి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## యువతుల అసభ్యకర కామెంట్స్.. ప్రధాని మోదీ మరో వీడియో

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, సెంట్రల్ డెస్క్:**
నీట్ పేపర్ లీక్ సంఘటనలో విద్యార్థులు నిరసనలకు దిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సీజేపీ పార్టీ రంగంలోకి దిగగా, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది. అంతేకాదు, విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చే పనిలో పడింది కేంద్రం. ఈ క్రమంలో సోషల్ మీడియాలో మరో వీడియో విడుదల చేశారు ప్రధాని మోడీ. జంతర్ మంతర్ వద్ద జరిగిన పరిణామాలను దేశమంతా చూసిందని గుర్తు చేశారు.అక్కడ కొందరు యువకులు అసభ్యకర పదజాలాన్ని ఉపయోగించారని సీరియస్ అయ్యారు. తనతో పాటు తన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పటికీ, చిన్నతనంలో పొరపాట్లు సహజమని భావించి వారిని క్షమిస్తున్నట్లు ప్రకటించారు. యువతను శిక్షించడం లేదా వేధించడం పరిష్కారం కాదని వెల్లడించారు. దారి తప్పిన పిల్లలకు సరైన మార్గం చూపడమే సమాజ బాధ్యత అన్నారు. గత తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని, దేశ పురోగతి, ఉజ్వల భవిష్యత్తు కోసం యువత అంతా కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ప్రధాని మోడీ.



విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

## సింగారం ప్రధానోపాధ్యాయులు లెక్కల రవీంద్రా రెడ్డి సేవలు అభినందనీయం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఉద్యోగ విరమణ పొందిన రాజపేట మండలం సింగారం ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు లెక్కల రవీంద్ర రెడ్డి సేవలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి మరియు వారి సేవలు ఎంతో అభినందనీయం అని మాజీ శాసన మండలి ప్రభుత్వ విప్ , ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు పాదూరి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎన్.కె ఫంక్షన్ హాల్ లో పాఠశాల ఉపాధ్యాయురాలు సిహెచ్. సుప్రియ అధ్యక్షతన జరిగిన రవీంద్ర రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రవీంద్ర రెడ్డి ఏ పాఠశాలలో పనిచేసినా పూర్తి సమయాన్ని విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి సంక్షేమానికి పాటుపడే విధంగా కృషి చేస్తూ పనిచేస్తున్న పాఠశాలలలో స్వంత ఖర్చులతో అనేక మౌలిక వసతులు కల్పించి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అనేక మంది గ్రామస్తులు పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి మండల విద్యాధికారి చందా రమేష్ మాట్లాడుతూ... గత 25 నెలలుగా పాఠశాల అభివృద్ధికి చేస్తూనే , విద్యార్థుల నమోదుకు కృషి చేసి విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేశారని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ శ్రీమతి ప్రమీలా పండరి మాట్లాడుతూ, ప్రధానోపాధ్యాయులు లెక్కల రవీంద్ర రెడ్డి మా గ్రామంలో పాఠశాలను ఎంతో అభివృద్ధి చేశారని తెలపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు కె.మనోజ్ కుమార్, టి.రాజు, బీ.వసంత, ఎస్.విజయలక్ష్మి , కిరణ్మయి, జే.ప్రభాకర్, జి.కోటిరెడ్డి, బి.రమేష్, ఎం.శ్రీనివాస్, పీఆర్టీయూ కె.అమరేందర్ రెడ్డి, ఎస్.సుబ్బరాజు, జి.బాలరాజు టీపీయూఎస్ డి.జానయ్య టీపీటీఎఫ్ వీరభద్రం, డీటీఎఫ్ నాగరాజు, మండలంలోని ఉపాధ్యాయులు, రవీంద్రారెడ్డి బందు మిత్రులు పాల్గొన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు రవీంద్ర రెడ్డిని అందరూ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్వానితులను ఎంతో ఆకట్టుకున్నాయి. అంతకు ముందు పాఠశాలలో సుమారు 30 వేల రూపాయలు విలువ చేసే బ్యాగులను విద్యార్థులందరికీ ఉచితంగా పంపిణీ చేశారు.

# నేతలపై హనీట్రాప్‌కు ఉగ్రకుట్ర.. మహిళ అరెస్ట్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, సెంట్రల్ డెస్క్:**
పశ్చిమ బెంగాల్ పోలీసుల ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఓ భారీ నిఘా, ఉగ్ర కుట్రను ఛేదించింది. ఇటీవల వర్ధమాన్ పట్టణంలో అరెస్టయిన జైషే మహమ్మద్ అనుమానిత ఉగ్రవాది మహమ్మద్ హమీమ్ మోండల్‌తో సంబంధాలు ఉన్న అతని ప్రేయసి, సహచరి అర్పితా సర్కార్‌ను ఎస్.టి.ఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. జార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్ నుంచి అదుపులోకి తీసుకున్న ఈమెను బెంగాల్‌లోని వర్ధమాన్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. నిందితురాలు మోండల్‌తో నిరంతరం వాట్సాప్ చాట్ల ద్వారా సంప్రదింపులు జరిపినట్లు పోలీసుల విచారణలో డిజిటల్ ఆధారాలు లభ్యమయ్యాయి.పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్న ఒక నెట్‌వర్క్‌లో మోండల్ భాగస్వామిగా ఉన్నాడని, రాష్ట్రంలో ఉగ్ర కార్యకలాపాలకు వేదిక సిద్ధం చేయడం, కొత్తవారిని చేర్చుకోవడంతో పాటు వీఐపీలపై నిఘా పెట్టడం ఇతని ప్రధాన బాధ్యతలని పోలీసులు తెలిపారు. ఈ కుట్రలో భాగంగానే అర్పితా సర్కార్‌ను ఉపయోగించి 'హనీ ట్రాప్' ద్వారా పశ్చిమ బెంగాల్‌లోని పలువురు కీలక రాజకీయనాయకులు, వీఐపీల సమాచారాన్ని, వారి వ్యక్తిగత వివరాలను సేకరించినట్లు తేలింది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి కదలికలు, ఆయన కాన్వాయ్ ప్రయాణించే మార్గాలపై మోండల్ ప్రత్యేక నిఘా ఉంచినట్లు ప్రాథమిక విచారణలో బయటపడింది.ఈ విధంగా సేకరించిన సున్నితమైన సమాచారాన్ని భవిష్యత్తులో దాడుల ప్రణాళికల కోసం ఉపయోగించాలని



చూశారా అనే కోణంలో ఎస్టీఎఫ్ అధికారులు ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాలను విశ్లేషిస్తున్నామని, ఈ కేసుకు అంతర్జాతీయ ఉగ్ర సంస్థలతో ఉన్న ముడిని వెలికితీసేందుకు సీనియర్ అధికారులు విచారణను వేగవంతం చేశారని పోలీసులు పేర్కొన్నారు.

# కులం అడిగి మరీ చంపేశారు: కుల్గామ్ ఉగ్రదాడిలో సంచలన విషయాలు వెలుగులోకి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, సెంట్రల్ డెస్క్ :**
జమ్మూ కాశ్మీర్ లోని కుల్గామ్ జిల్లాలో జరిగిన ఉగ్రదాడిలో ఛత్తీస్ ఘడ్ కు చెందిన ఇద్దరు కార్మికులను ఉగ్రవాదులు కాల్చి చంపారు. అయితే ఇందులో ఓ మృతుడి కుటుంబ సభ్యులు కీలక విషయాలను వెల్లడించారు. ఉగ్రవాదులు.. కులం, ఐడెంటిటీ, కమ్యూనిటీ అడిగి మరీ చంపేశారని తెలిపారు. 2025 లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి ఘటన తరహాలోనే ఈ దాడి జరిగిందని చెబుతూ కన్నీటి పర్యంతం అయ్యారు. గతేడాది ఏప్రిల్ 22 న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతులందరినీ హిందువా..? కాదా..? అని అడుగుతూ చంపేసిన సంగతి తెలిసిందే.సౌత్ కాశ్మీర్ లోని కేలమ్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న ఛత్తీస్ ఘడ్ కు చెందిన ఇద్దరు కార్మికులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో రఘువీర్, దీపక్ అనే ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. అయితే దీపక్ అక్కడికక్కడే మృతి చెందగా రఘువీర్ మాత్రం గాయలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. అంతకుముందు 9 రోజుల క్రితమే జమ్మూ కాశ్మీర్ లోని అనంత్ నాగ్ జిల్లాలో ఓ పోలీస్ అధికారిని ఉగ్రమూకలు కాల్చి చంపారు.అయితే ఈ ఉగ్రదాడిని దీపక్ కుటుంబ సభ్యులు తీవ్రంగా ఖండించారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతుడి స్వగ్రామం బుందేలీలో అంత్యక్రియలు జరపనున్నట్లు తెలిపారు. దీపక్ బంధువు హల్దార్ మాట్లాడుతూ.. " దీపక్ గత 6 నెలలుగా అక్కడ పనిచేస్తున్నాడు. జూలై 31 న అర్ధరాత్రి సమయంలో ఉగ్రవాదుల దాడిలో దీపక్ గాయపడినట్లు మాకు సమాచారం వచ్చింది. ఈ



ఘటనలో ఇద్దరు కార్మికులపై ఉగ్రవాదులు టార్గెట్ చేశారు. మాకు అందిన సమాచారం ప్రకారం ఉగ్రవాదులు కులం, కమ్యూనిటీ ఏంటి..? అని అడిగి మరీ ఈ దారుణానికి పాల్పడ్డారు" అని హల్దార్ స్పష్టం చేశారు.మరోవైపు ఈ ఘటనపై జమ్మూ కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా మృతుల కుటుంబాలకు 10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. ఈ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు.

# "సూపర్ ఎల్ నినో": "వర్షాలు మర్చిపోండిక"– ప్రపంచ వాతావరణ సంస్థ షాకింగ్ రిపోర్ట్..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01:**
ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్ నినో ప్రభావంతో భారత్ లో నైరుతి రుతుపవనాల జాడ కనిపించడం లేదు. మొదట్లో సకాలంలో వచ్చినట్లే వచ్చి వెళ్లిపోయిన రుతుపవనాలు ఆ తర్వాత బలహీన పడటం ప్రారంభమైంది. ఇప్పుడు బంగాళాఖాతంతో పాటు అరేబియా సముద్రంలో అడపాదడపా అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడితే తప్ప వర్షాలు కురిసే పరిస్థితి లేదు. ఇప్పటికే ఆగస్టు నెలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతమే ఉంటుందని భారత వాతావరణ విభాగం హెచ్చరికలు చేసింది. ఈ ప్రకటన వచ్చిన 24 గంటల్లోనే ప్రపంచ వాతావరణ సంస్థ "డబ్ల్యూఎంఓ" మరో షాకిచ్చింది.ఈ సీజన్ లో ఇప్పటికే కురవాల్సిన వర్షపాతం కన్నా చాలా చోట్ల తక్కువ వర్షపాతం నమోదవుతుండగా.. ఇప్పుడు ఎల్ నినో ప్రభావం మరింత తీవ్రమై రుతుపవనాల్ని మరింత బలహీనం చేయబోతోందని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ తన తాజా రిపోర్ట్ లో పేర్కొంది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ఆగస్టులో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని అంచనా వేసింది. ఇప్పుడు ప్రపంచ వాతావరణ సంస్థ కూడా రుతుపవనాలు మరింత బలహీన పడటం ఖాయమని తేల్చేయడంతో ఈసారి సాధారణ స్థాయి వర్షాలు లేకుండానే వర్షాకాలం వంగిని పోయేలా కనివిస్తోంది. ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకారం ఈ ఏడాది ఆగస్టు – అక్టోబర్ కాలంలో సూపర్ ఎల్ నినో బలపడుతుందని అంచనా వేసింది. అసాధారణంగా వేడెక్కిన సముద్రాలు, సానుకూల భారతీయ సముద్రాల పరిస్థితులతో పాటు, ఇది ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రాంతాలలో ఉష్ణోగ్రతల్ని అసాధారణంగా పెంచేయడంతో పాటు వర్షపాత సరళిని గణనీయంగా మారుస్తుందని భావిస్తున్నారు. దీనివల్ల కొన్ని ప్రాంతాలు అధిక వర్షపాతాన్ని పొందే అవకాశం ఉండగా, మరికొన్ని ప్రాంతాలు కరువు




ముప్పును ఎదుర్కోవచ్చు. ఈ ఏడాది దేశంలో రుతుపవనాల పరిస్థితి దారుణంగా ఉంది. చాలా ప్రాంతాలలో రుతుపవనాల పురోగతి నిలిచిపోయింది. దీంతో జూన్, జూలై నెలల్లో భారీగా వర్షపాత లోటు కనిపించింది. ఇప్పుడు ఆగస్టులోనూ అదే పరిస్థితి తప్పేలా లేదు. ఇక మిగిలిన సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సూపర్ ఎల్ నినో ప్రభావం ఉంటుందన్న హెచ్చరికలతో వర్షాకాలం ఇక లేకపోవచ్చని అర్థమవుతోంది.

# ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఆలేరు అభివృద్ధే మా ధ్యేయం...**

**ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధనే మా లక్ష్యం....**

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆలేరు పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలేరు రెవెన్యూ డివిజన్ అంశంపై అఖిలపక్షాలు కలిసి ధర్నా నిర్వహించడం ప్రజాస్వామ్యంలో వారి హక్కేనని అన్నారు. అయితే ప్రజలను తప్పుదోవ పట్టించేలా సత్యానికి దూరంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆలేరు రెవెన్యూ డివిజన్ గురించి ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ఆ సమయంలో అసెంబ్లీలో ఈ అంశాన్ని ఎన్నిసార్లు ప్రస్తావించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు చేయలేని పనిని ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను రెచ్చగొట్టేందుకు ఉపయోగించుకోవడం బాధాకరమని అన్నారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై తాను అసెంబ్లీలో రెండుసార్లు ప్రస్తావించానని తెలిపారు. తిరుమలపూర్ బహిరంగ సభలో కూడా ఈ డిమాండ్‌ను ప్రజల ముందుంచానని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో ప్రత్యేకంగా చర్చించినట్లు వెల్లడించారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధించడమే తన లక్ష్యమని, ఈ అంశాన్ని నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నానని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 25 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఆలేరును ఎందుకు విస్మరించిందని ప్రశ్నించారు. ఇప్పుడు అదే పార్టీ నాయకులు జెండాలు పట్టుకుని నిరసనలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఆలేరు అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. మల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ నిర్మిస్తామని ప్రకటించినా అమలు చేయలేకపోయారని విమర్శించారు. అయితే తమ ప్రభుత్వం 20 ఎకరాల్లో మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేసిందని తెలిపారు. ఆలేరు పట్టణ అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టామని, సుమారు 500 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందించామని చెప్పారు. పట్టణంలో సుమారు 200 ఇళ్లను మంజూరు చేశామని, తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆలేరు మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. గత పదేళ్లలో తీసుకొచ్చిన నిధులతో పోలిస్తే కేవలం రెండున్నర సంవత్సరాల్లోనే భారీ స్థాయిలో అభివృద్ధి నిధులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రూ.44 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అండర్‌పాస్ నిర్మాణం ప్రారంభమై త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుందని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో ఆధునిక మున్సిపల్ కార్యాలయ భవనాల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. బహదూర్‌పేట చెరువును సుమారు రూ.2.5 కోట్లతో అభివృద్ధి చేశామని, గత ప్రభుత్వం పదేళ్లలో తీసుకొచ్చిన నిధులకు సమానంగా తాము రెండున్నర సంవత్సరాల్లోనే సుమారు రూ.70 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకొచ్చామని తెలిపారు. వచ్చే నెలలో మరో రూ.10 కోట్ల నిధులు తీసుకురానున్నట్లు వెల్లడించారు. కొలనుపాక--కాల్వపల్లి వంతెన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఆలేరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రతిపక్షాలకు తన విజ్ఞప్తి ఒక్కటేనని, ప్రజల ప్రయోజనాల కోసం అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన కోసం సహకరించాలని, అనవసర రాజకీయాలు కాకుండా అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బిజాన బాలమణి, పిఏసిఎస్ చైర్మన్ జనగాం ఉపేందర్ రెడ్డి, ఆలేరు మాజీ పట్టణ అధ్యక్షుడు ఎంఎ ఎజాజ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అసలేంటి ఈ సముద్ర మంథన్.. భారత్ దీనిపై రూ. 84,084 కోట్లు ఎందుకు ఇన్వెస్ట్ చేస్తోంది?

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 01, సెంట్రల్ డెస్క్:**
సముద్ర మంథన్ పేరిట భారత్ ఓ భారీ తీరప్రాంత ఇంధన అన్వేషణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సముద్ర గర్భంలో దాగి ఉన్న చమురు, సహజ వాయువుల నిల్వలను వెలికితీసే లక్ష్యంతో సుదీర్ఘ కాల పరిమితితో ఈ పథకాన్ని ప్రారంభించింది. 'నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ స్కీమ్' పేరిట అధికారికంగా అమలు కానున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కేంద్రం రూ.84,084 కోట్ల వ్యయాన్ని కేటాయించింది. ఈ పథకం 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు కొనసాగనుంది. మన దేశానికి చెందిన లోతైన సముద్ర ప్రాంతాల్లో విస్తారమైన ఇంధన నిల్వలు ఉన్నప్పటికీ, అవి ఇంకా వెలికితీతకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో లోతైన సముద్ర అన్వేషణను వేగవంతం చేసి, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం. క్షీరసాగర మథనం ద్వారా అమూల్యమైన రత్నాలను వెలికితీసినట్లు వర్ణించే పురాణాల ఆధారంగా ఈ పథకానికి సముద్ర మంథన్ అని నామకరణం చేశారు. 2025 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారత్ ఇంధన సామర్థ్యాన్ని వెలికితీసేందుకు ఆధునిక 'సముద్ర మంథన్' చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రధాని ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ప్రస్తుతం భారత్ తనకు కావలసిన చమురు (క్రూడ్ ఆయిల్) లో దాదాపు 88% నుండి 89% వరకు, అలాగే సహజ వాయువులో



సగానికి పైగా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. దేశంలో ఇంధన వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం భారత్‌కు అత్యవసరంగా మారింది.

**భారత్‌కు 'సముద్ర మంథన్' ఎందుకు అవసరం?**

భారత తీరప్రాంతాల్లో చమురు, సహజ వాయువు ఉండేందుకు ఆస్కారం ఉన్న పలు అవక్షేపణ బేసిన్లు ఉన్నాయి. అయితే సముద్రంలో అన్వేషణ అత్యంత సాంకేతిక శ్రమతో, భారీ వ్యయంతో కూడుకున్నది, తీవ్రమైన రిస్క్‌తో కూడినది కావడంతో ఇవి ఇంకా అన్వేషణకు నోచుకోలేదు. ఈ పథకం కింద ప్రారంభ దశలో చేపట్టే బృహత్తర సీస్మిక్ సర్వేలు, జియోలాజికల్ అధ్యయనాలు, ప్రయోగాత్మక డ్రిల్లింగ్, భాగస్వామ్య సముద్ర మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి నిధులను ప్రభుత్వమే సమకూరుస్తుంది. ఈ ప్రాంతాల్లో ఖచ్చితమైన సమాచారాన్ని సమీకరించడం ద్వారా వ్యాపార సంస్థలు చమురు అన్వేషణలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించడం ఈ పథకం యొక్క వ్యూహం.

## SPORTS

# కామన్వెల్త్ క్రీడల్లో భారత్ జోరు.. మరో రెండు బంగారు పతకాలు




గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో శనివారం భారత్‌కు చిరస్మరణీయంగా నిలిచింది. పారా అథ్లెటిక్స్, బాక్సింగ్‌లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాలు సాధించి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. పారా షాట్‌పుట్‌లో సోమన్ రాణా స్వర్ణం, శుభం జుయల్ రజత పతకం గెలిచి చరిత్ర సృష్టించగా, బాక్సింగ్‌లో జైస్మిన్ తమ పంచ్ పవర్‌తో పసిడిని ముద్దాడింది.

పారా అథ్లెటిక్స్‌లో చారిత్రక విజయం

పురుషుల షాట్‌పుట్ ఎఫ్57 విభాగంలో భారత పారా అథ్లెట్లు అసాధారణ ప్రతిభ కనబరిచారు. సోమన్ రాణా స్వర్ణం సాధించగా, శుభం జుయల్ రజత పతకాన్ని గెలుచుకున్నారు. కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో ఈ విభాగంలో భారత్‌కు ఇదే తొలి స్వర్ణ పతకం కాగా, ఒకే ఈవెంట్‌లో స్వర్ణ, రజత పతకాలు (డబుల్ పోడియం) సాధించడం కూడా ఇదే మొదటిసారి. సోమన్ రాణా తన రెండో ప్రయత్నంలో 13.40 మీటర్ల దూరం విసిరి స్వర్ణాన్ని ఖాయం చేసుకున్నాడు. ఆ తర్వాత ఏ అథ్లెట్ కూడా ఈ మార్కును దాటలేకపోయాడు. మరోవైపు, శుభం జుయల్ తన ఆరో, చివరి ప్రయత్నంలో 13.28 మీటర్లు విసిరి అనూహ్యంగా రెండో స్థానానికి దూసుకొచ్చి రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. కామెరూన్‌కు చెందిన సెడ్రిక్ ఇడ్రిస్ (12.57 మీ) కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. ఈ విజయం వెనుక ఇద్దరు అథ్లెట్ల స్ఫూర్తిదాయక ప్రయాణం ఉంది. 2006లో జమ్మూ కాశ్మీర్‌లో ల్యాండ్ మైన్ పేలుడులో తీవ్రంగా గాయపడిన భారత సైనికుడు సోమన్ రాణా, పట్టుదలతో పారా అథ్లెట్‌గా మారి దేశానికి కీర్తి తెచ్చిపెట్టాడు. మరోవైపు, ఆర్మీ అధికారి కావాలనుకున్న శుభం, 2022లో ఒక ప్రమాదంలో కాలు కోల్పోయి, పారా క్రీడల వైపు మళ్లి అతి తక్కువ కాలంలోనే కామన్వెల్త్ పతక విజేతగా నిలిచాడు

బాక్సింగ్‌లో ప్రీతి, జైస్మిన్ స్వర్ణ ఘనత

మరోవైపు, బాక్సింగ్ లో జైస్మిన్ అద్భుత విజయాన్ని నమోదు చేసి భారత శిబిరంలో ఆనందాన్ని రెట్టింపు చేసింది. జైస్మిన్ మహిళల 57 కేజీల విభాగం ఫైనల్‌లో ఉత్తర ఐర్లాండ్‌కు చెందిన మిచెలా వాల్ష్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మొదటి రౌండ్ నుంచే పదునైన పంచ్‌లు, అద్భుతమైన ఫుట్‌వర్క్‌తో ప్రత్యర్థిపై విరుచుకుపడింది. మూడు రౌండ్ల పాటు సాగిన ఈ పోరులో జైస్మిన్ 5-0 తేడాతో ఏకగ్రీవ నిర్ణయంతో ఘన విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఐదుగురు జడ్జీలు ఏకగ్రీవంగా ఆమెకే ఓటు వేయడం ఆమె ఆధిపత్యానికి నిదర్శనం. అంతకుముందు, బాక్సింగ్‌లో భారత క్రీడాకారిణి ప్రీతి పవార్ 54 కిలోల కేటగిరీలో అద్భుత విజయంతో పసిడి పతకం అందుకోవడం తెలిసిందే.

# 'ప్రతి త్రోకు ముందు భయపడ్డా'..

**.రజతం తర్వాత నీరజ్ చోప్రా ఎమోషనల్ కామెంట్స్**




దాదాపు ఏడాది తర్వాత మళ్లీ ప్రధాన అంతర్జాతీయ టోర్నీలో పతకం గెలిచిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తన మనసులోని మాటను బయటపెట్టాడు. కామన్వెల్త్ గేమ్స్ 2026లో రజత పతకం సాధించిన తర్వాత మాట్లాడిన అతడు.. ఎక్కడ గాయం తిరగబెడుతుందేమోనన్న భయం ప్రతి త్రోకు ముందు వెంటాడిందని వెల్లడించాడు. అయినప్పటికీ ఆ ఒత్తిడిని అధిగమించి దేశానికి పతకం అందించడం ఆనందంగా ఉందని చెప్పాడు. పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్.. సీజన్‌లో అత్యుత్తమంగా 85.83 మీటర్లు విసిరి రజత పతకం సాధించాడు. శ్రీలంక అథ్లెట్ రుమేశ్ తరంగా పతిరాగే 89.75 మీటర్ల భారీ త్రోతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మరో భారత అథ్లెట్ యశ్‌వీర్ సింగ్ వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో 85.41 మీటర్లు విసిరి కాంస్య పతకం దక్కించుకున్నాడు. పోటీ అనంతరం నీరజ్ మాట్లాడుతూ.. తన పునరాగమనం సానుకూలంగా సాగుతోందని తెలిపాడు. చలి వాతావరణంలో తన ప్రదర్శన అంతగా ఉండదని, తాను భారతీయుడినని నవ్వుతూ వ్యాఖ్యానించాడు. అయినా మళ్లీ పతకాల వేదికపై నిలవడం ఎంతో సంతోషంగా ఉందన్నాడు. తాను చేసిన కష్టానికి ఇప్పుడు ఫలితం కనిపిస్తోందని చెప్పాడు. గాయం పూర్తిగా నయం కాకపోవడం వల్ల ప్రతి త్రోకు ముందు భయపడ్డానని నీరజ్ వెల్లడించాడు. "100 శాతం ఫిట్‌గా ఉంటే ఎంతటి సవాలునైనా ఎదుర్కోగలమన్న ధైర్యం ఉంటుంది. కానీ గాయం ఉంటే భయం వెంటాడుతుంది. ఈరోజు కూడా అదే జరిగింది. చాలా వేగంగా పరుగెత్తకుండా శరీరాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించాను. అయినా నా త్రో బాగానే వచ్చింది" అని వివరించాడు. ఈ పోటీలో తనకు కూడా ఒక్క మంచి త్రో మాత్రమే వచ్చిందని నీరజ్ చెప్పాడు. మిగతా ప్రయత్నాల్లో జావెలిన్ ఆశించిన విధంగా వెళ్లలేదని పేర్కొన్నాడు. విజేత రుమేశ్ తరంగా కూడా ఒక్క అద్భుతమైన త్రోతోనే స్వర్ణం సాధించాడని గుర్తు చేశాడు. ఇకపై జరిగే పోటీల్లో మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వడమే తన లక్ష్యమని స్పష్టం చేశాడు

# ట్రిపుల్ జంపులో డబుల్ బొనాంజా.. డెకాథ్లాన్‌లో తొలి పతకం..!

కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు అదరగొట్టారు. ట్రిపుల్ జంప్ క్వాలిఫయింగ్‌లో మెరిసిన ప్రవీణ్ చిత్రవేల్, సెల్వ ప్రభు తిరుమరన్లు ఫైనల్లోనూ సత్తా చాటి పతకాలు సాధించారు. శనివారం జరిగిన ఫైనల్లో ప్రవీణ్ 16.58 మీటర్లు, సెల్వ 16.52 మీటర్ల దూరం దూకి వరసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. డెకథ్లాన్‌లో దేశానికి మొట్ట మొదటి పతకం అందించాడు తేజస్విన్ శంకర్. పోడియం మీద ఈ ముగ్గురూ సగర్వంగా పతకాలు స్వీకరించి మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు పదో రోజు కూడా పతకాల వేట కొనసాగించారు. బాక్సర్లు ప్రీతి పవర్, జాస్మినె లంబోరియాలు స్వర్ణాలు అందించగా.. ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ రజతం, సెల్వ ప్రభు కాంస్యంతో మెరిశారు.




Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.